తొలివెలుగు
జాతీయ దిన పత్రిక
మన భాష.. మన పత్రిక..
https://tholivelugu.com/
హైదరాబాద్ సంపుటి:01 సంచిక: 67 19-3-2026 వెల: రూ.2/- పేజీలు: 06

విలేకరులు కావలెను
తొలివెలుగు
www.epaper.tholivelugu.com
Contacts
తెలంగాణ
94911 34365
ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో
తొలివెలుగు జాతీయ తెలుగు దినపత్రికలో పలు విభాగాల్లో పనివేయుటకు ఉత్సాహవంతులైన స్టేట్ బ్యూరో, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, మండల రిపోర్టర్లు కావలెను. ఆసక్తి.. అనుభవం గల వారు సంప్రదించగలరు.



ఉగాది పండుగ మీ జీవితంలో ఆనందం, ఆరోగ్యం, ఐశ్వర్యం నింపాలని కోరుకుంటూ ఉగాది శుభాకాంక్షలు

తొలివెలుగు
జాతీయ దిన పత్రిక

నిరూపిస్తే రాజీనామా!

- మహిళలకు 57వేల కోట్ల వడ్డీ లేని రుణాలు ఇవ్వలేదు
- అబద్ధాలు చెప్పిన వారు రాజీనామా చేయాలె
- డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి సీతక్క ఇద్దరిలో ఎవరు సిద్ధం
- అసెంబ్లీలో డ్రగ్ టెస్టు చేయిమన్నం.. వీళ్లకు దమ్ము లేదు
- పొంగులేటి కొడుకు కబ్జాలు చేస్తే .. ఆఫీసర్ ను ట్రాన్స్‌ఫర్ చేసిండ్రు
- మూసీ ప్రాజెక్టు మొత్తం రియల్ ఎస్టేట్ కోసమే
- చిట్ చాట్ లో మాజీ మంత్రి కేటీఆర్

మూసీపై చర్చ
కేటీఆర్ Vs శ్రీధర్ బాబు

- రూ. 7 వేల కోట్లతో డీపీఆర్ రెడీ అయ్యిందన్న శ్రీధర్ బాబు
- 2013 చట్టం ప్రకారం భూసేకరణ, పునరావాసమన్న మంత్రి
- బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన జీవో ప్రకారమే బఫర్ జోన్ డిసైడ్
- మూసీ పునరుజ్జీవానికి తాము వ్యతిరేకం కాదన్న కేటీఆర్
- పాకిస్తాన్ రెడ్ కార్నర్ నోటీసు ఇచ్చిన సంస్థకు డీపీఆర్ బాధ్యతలా?
- మంత్రి 1,435 నిర్మాణాలు కూల్చేస్తామన్నారు.. గెజిట్ లో 10వేలని ఉంది
- 50 మీటర్ల బఫర్ జోన్ అని చెప్పి 5 కి.మీ దూరంలో ఉన్న హనుమాన్ నగర్‌కు నోటీసులా?
- రూ.లక్షన్నర కోట్ల దోపిడీకి మేం వ్యతిరేకమంటూ బీఆర్ఎస్ వాకౌట్

హైదరాబాద్: మూసీ పునరుజ్జీవంపై ఇవాళ అసెంబ్లీలో వాడీ వేడి చర్చ జరిగింది. మంత్రి శ్రీధర్ బాబు, మాజీ మంత్రి కేటీఆర్ మధ్య మాటల యుద్ధం నడిచింది. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కూడా చర్చలో కి ఎంట్రీ ఇచ్చారు. మురికి కూపంలో జీవిస్తున్న ప్రజల జీవనస్థితి గతులను మార్చాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించిందంటూ ప్రభుత్వం తరఫున క్లారిటీ ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. మూసీ పునరుజ్జీవానికి సంబంధించి మొదటి దశ డీపీఆర్ తయారైందని చెప్పారు. అంచనా వ్యయం రూ. 6,500 కోట్ల నుంచి రూ. 7000 కోట్లుగా చెప్పారు. ఈ ప్రాజెక్టుతో 1,435 నిర్మాణాలు ప్రభావితమయ్యే అవకాశముందన్నారు. తుది ఎన్యుమరేషన్ కొనసాగుతోందని చెప్పారు. బఫర్ జోన్‌లో ఉన్నవారికి టీడీఆర్ ఇస్తామని.. 2013 చట్టం ప్రకారం అవసరమైన భూసేకరణ, సహాయ, పునరావాస కార్యక్రమాలు చేపడతామని అన్నారు. దీనిపై మాజీ

2029లో మళ్లీ చూసుకుందాం

- 2029 ఎన్నికల పాసింగ్ క్లాడ్స్ మాత్రమే... 2034 వరకు ఈ ప్రభుత్వమే ఉంటుంది
- ప్రజాస్వామ్యంలో ప్రజలే రాజులుగా మారి తమ సేవకులను నియమించుకుంటారు... ఇప్పటికైనా అది గ్రహించాలి
- గత ప్రభుత్వ రూ. 8.11 లక్షల కోట్ల అప్పు, 11 శాతం అధిక వడ్డీ భారం వల్లనే మా ప్రభుత్వానికీ పరిస్థితి
- వారసత్వాలతో అధికారం రాదు... చెట్లుపేరు చెప్పి కాయలు అమ్ముకుంటామంటే కుదరదు.
- ప్రజలు ఆగ్రహిస్తే ఈసారి అది కూడా (ప్రతిపక్ష హోదా) ఉండదు..
- కొత్త గవర్నర్‌కు శుభాకాంక్షలు చెప్పేందుకు కేసీఆర్ అసెంబ్లీకి వస్తారని ప్రజలు ఆశించారు

హైదరాబాద్: 2029 అసెంబ్లీ ఎన్నికల్లోనూ మిమ్మల్ని మళ్లీ తొక్కుకుంటూ అధికారంలోకి వస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బీఆర్ఎస్ నేతలకు సవాల్ విసిరారు. '2023 ఎన్నికల్లో బరాబర్ మీ నెత్తిపై కాళ్లు పెట్టి తొక్కుకుంటూ ఇక్కడకు వచ్చాను. 2029లో మళ్లీ చూసుకుందాం. మళ్లీ తొక్కకపోతే చూడండి. మీరు ఎట్లా గెలుస్తారో చూస్తాను'అని ఆవేశంగా ప్రకటించారు. బుధవా రం శాసనసభలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానానికి సమాధానమిస్తూ రెండున్నర గంటలకుపైగా సుదీర్ఘంగా సీఎం ప్రసంగించారు.

ఇంధన కేంద్రాలే టార్గెట్

- ఇరాన్‌లో అతిపెద్ద సహజ వాయువు క్షేత్రంపై భీకర దాడి
- గల్ఫ్ దేశాల్లోని ఇంధన కేంద్రాలపై విరుచుకుపడిన ఇరాన్
- కువైట్, బహ్రెయిన్, ఖతార్, యూఏఈపై క్షిపణులతో దాడి
- సురక్షిత ప్రాంతాలకు వెళ్లిపోవాలంటూ చమురు కేంద్రాల కార్మికులకు సూచన
- అంతర్జాతీయ మార్కెట్‌లో108 డాలర్లకు చేరిన బ్యారెల్ ముడిచమురు
- అమెరికాపై ఒత్తిడి పెంచే వ్యూహాన్ని అమలు చేస్తున్న ఇరాన్
- ఇరాన్‌లోని కోర్టు సముదాయంపై భారీ దాడి... 8 మంది మృతి
- ఇజ్రాయెల్‌పై ఇరాన్ వైమానిక దాడుల్లో ఇద్దరు బలి

దుబాయ్/టెహ్రాన్: పశ్చిమాసియాలో చమురు, సహజ వాయువు కేంద్రాలే యుద్ధ క్షేత్రాలుగా మారిపోతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఇప్పటికే ఇంధన ధరలు మండిపోతున్నప్పటికీ ఇరాన్, అమెరికాఇజ్రాయెల్ వెనక్కి తగ్గడం లేదు. యుద్ధం బుధవారం 19వ రోజుకు చేరుకుంది. ఇరాన్‌లో అతిపెద్ద సహజ వాయువు క్షేత్రమైన 'సౌత్ ఫార్స్'పై ఇజ్రాయెల్ సైన్యం భీకర దాడికి దిగింది. ఇక్కడ నిత్యం 100 మిలియన్ క్యూబిక్ మీటర్ల నేచురల్ గ్యాస్ ఉత్పత్తి అవుతోంది.

2లో

ఇజ్రాయెల్ గూఢచారికి ఇరాన్ గడ్డపై ఉరిశిక్ష

- మొస్సాద్‌కు రహస్యాలు చేరవేసినట్లు నిర్ధారణ
- కురుష్ కీవాని అనే వ్యక్తికి మరణశిక్ష

2లో

నేపాల్‌లో కూలిన హెలికాప్టర్

- మృతదేహాన్ని తీసుకెళ్తుండగా ఘటన
- సోషల్ మీడియాలో వీడియో వైరల్

2లో

అకాల వర్షం..రైతుకు నష్టం

- మొక్కజొన్నను కొనుగోలు చేయాలి
- దెబ్బతిన్న అరటి, మామిడి, మొక్కజొన్న, మినుము పంటలు
- అమరావతిలో 9 సెం.మీ. వర్షం
- నేడూ, రేపూ పిడుగుల వానలు

మాతో ప్రేమ, మోదీతో పెళ్లి

ర్లమెంట్ అంటే ఓపెన్ యూనివర్సిటీ
రాజకీయాల్లో నాయకులకు పదవీ విరమణ ఉండదు: మోదీ
రాజ్యసభలో 59 మంది ఎంపీలకు వీడ్కోలు

న్యూఢిల్లీ: పార్లమెంట్ అంటే ఒక ఓపెన్ యూనివర్సిటీ అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. పార్లమెంట్ సభ్యత్వం ముగిసినప్పటికీ సభ్యులు ప్రజా జీవితంలో క్రియాశీలక పాత్ర పోషిస్తూనే ఉండాలని అన్నారు. రాజకీయాల్లో ఫుల్‌స్టాప్ ఉండదని ఉద్ఘాటించారు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి జూలై వరకు రాజ్యసభ సభ్యత్వం ముగుస్తున్న 59 మంది సభ్యులు ఇన్నాళ్లూ అందించిన సేవలను ప్రధానమంత్రి కొనియాడారు. ఆయా సభ్యులకు బుధవారం రాజ్యసభలో వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా సభను ఉద్దేశించిన ప్రధాని మోదీ మాట్లాడారు. ఇలాంటి వీడ్కోలు సందర్భాలు సహజంగానే రాజకీయ విభేదాలను తొలగిస్తాయని అన్నారు. సహజంగా, అప్రయత్నంగా రాజకీయ విభేదాలకు అతీతంగా వ్యవహరిస్తామని, మనందరిలో ఒక ఉమ్మడి భావన ఉద్భవిస్తుందని వ్యాఖ్యానించారు. సభకు ఇక తిరిగి వచ్చే ఆలోచన లేని సభ్యులకు భరోసా ఇచ్చారు. రాజకీయాల్లో పూర్తి విరామం అనేది ఎప్పుడూ ఉండదన్నారు. భవిష్యత్తు మీ కోసం ఎదురుచూస్తోందని సూచించారు.

నిరూపిస్తే రాజీనామా!

హైదరాబాద్: స్వయం సహాయక సంఘాలకు మహిళలకు 57వేల కోట్ల వడ్డీ లేని రుణాలు ఇచ్చినట్టు నిరూపిస్తే తాను రాజీనామా చేస్తానని మాజీ మంత్రి కేటీఆర్ సవాలు విసిరారు. ఈ విషయాన్ని ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క అసెంబ్లీలో చెప్పారన్నారు. ఆర్డర్ చూపిస్తే రాజీనామాకు సిద్ధమని తాను చెప్పానని, ఇప్పుడు మంత్రి సీతక్క రాజీనామా చేయాలని అంటున్నారని చెప్పారు. అసెంబ్లీ వేదికగా అన్నీ అబద్ధాలు చెబుతున్నారని, ఇప్పటికీ తాను స్టాండ్ మీదే ఉన్నానని అన్నారు. అబద్ధాలు చెప్పిన భట్టి విక్రమార్క రాజీనామా చేస్తారా..? సీతక్క రిజైన్ చేస్తారా? తేల్చుకోవాలని అన్నారు. ఇవాళ ఆయన అసెంబ్లీ ఆవరణలో మీడియాతో చిట్ చాట్ చేశారు. మూసీ ఎండీ నర్సింహారెడ్డి ఆరు నూరైనా పునరుజ్జీవం పూర్తి చేస్తామంటున్నారని, ఆయన ఎవరని ప్రశ్నించారు. తానే ప్రభుత్వమన్నట్టుగా మాట్లాడటం ఏంటన్నారు. అధికారులు ఒళ్లు దగ్గరపెట్టుకొని మాట్లాడాలని అన్నారు. రిటైర్ అయినా కూడా ఇలాంటి అధికారులను వదిలిపెట్టబోమని కేటీఆర్ హెచ్చరించారు. అడ్డగోలు నిర్ణయాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని అన్నారు. సర్కారు నడుపుతున్నారా? సర్కస్ నడుపుతున్నారా? అర్థం కావడం లేదని అన్నారు. ఫ్యూచర్ సిటీలో భూ సేకరణ జరిగింది ఫార్మాసిటీ కోసమని, అక్కడ జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇస్తే కాలుష్యం మధ్య జీవించాలా? అని ప్రశ్నించారు. మూసీ ప్రక్షాళనకు ఆద్యుడు కేసీఆర్ అని అన్నారు.

2029లో మళ్లీ చూసుకుందాం

'ఇప్పటికైనా మీరు మర్యాదగా ఉండడం నేర్చుకుంటే మంచిది. కనీస మర్యాద దక్కుతుంది'అని హెచ్చరించారు. 2029 ఎన్నికలు కూడా కేవలం పాసింగ్ క్లౌడ్ మాత్రమే. 2034 వరకు ఈ ప్రభుత్వమే ఉంటుంది. అప్పటికే తెలంగాణ ఒక ట్రిలియన్ ఎకానమీగా ఎదుగుతుందని ప్రజలు విశ్వసిస్తున్నారు'అని చెప్పారు. ప్రతిపక్ష సభ్యులు ఆరోపిస్తున్న హిల్ట్‌పి, టీడీఆర్‌లకు సంబంధించి వారు లేఖ రాస్తే ఏ విచారణ కోరినా చేయడానికి తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. 'కొందరు తమను తాము రాజులుగా భావిస్తున్నారు. రాచరిక పోకడలతో ప్రజాతీర్పును అవమానిస్తున్నారు. వారసత్వ రాజకీయాలను నమ్ముకుని అధికారం దక్కలేదనే దుఃఖంతో ఆరోపణలు, దుష్ప్రచారంతో సభను తప్పుదోవ పట్టించారు. రాజులు పోయినా రాజ్యాలు పోయినా వారి పోకడలు మారలేదు. ప్రజాస్వామ్యంలో ప్రజలే రాజులుగా మారి తమ సేవకులను నియమించుకుంటారన్న విషయాన్ని ఇప్పటికైనా గ్రహిస్తే మంచిది'అని బీఆర్ఎస్ సభ్యులను ఉద్దేశించి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు.

గత ప్రభుత్వం వల్లనే ఈ దుస్థితి

రాష్ట్ర ఆదాయంపెంచాలి.. పేదలకు పంచాలి అనే పాలసీ తీసుకొస్తే కూడా అభినందించాలనే ఆలోచన ప్రతిపక్షాలకు రాకపోతే వారిని ఏమనాలని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. 'తెలంగాణ అభివృద్ధి, ప్రజల భవిష్యత్ పట్ల సభావేదిక నుంచి వివరించాను. అధికారం పోయిందనే బాధతో ఇది కొందరికి రుచించదు. వారు కక్కిన విషాన్ని శివుడి మాదిరిగా గొంతులోనే పెట్టుకుంటాను'అని అన్నారు. తమపై గత ప్రభుత్వం పదేళ్లలో రూ.8.11 లక్షల కోట్ల అప్పు భారాన్ని, దానికి 11 శాతం అధిక వడ్డీ మోపినందుకు, దానిని భరించడం వల్లనే తమ ప్రభుత్వానికి ప్రస్తుత పరిస్థితి ఏర్పడిందన్నారు. తెలంగాణ ప్రజల ఆలోచనలు, ఆకాంక్షలను ప్రతిబింబిస్తూ, రాష్ట్ర అభివృద్ధి పట్ల ఈ ప్రభుత్వానికి ఉన్న సంకల్పాన్ని, గొప్ప విజన్‌ను ఆవిష్కరిస్తూ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా చేసిన ప్రసంగం చరిత్రాత్మకమని రేవంత్‌రెడ్డి చెప్పారు. 'గవర్నర్ ప్రసంగం కేవలం అక్షరాల రూపంలో ఉన్న ఆలోచనలు కాదు. తెలంగాణ అభివృద్ధికి మార్గదర్శి. 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణ ఎదగడానికి అవసరమైన విశిష్ట ప్రణాళిక'అని రేవంత్ పేర్కొన్నారు.

అకాల వర్షం..రైతుకు నష్టం

అకాల వర్షం రాష్ట్రంలో రైతులకు నష్టం కలిగించింది. బుధవారం మధ్యాహ్నం తర్వాత కోస్తా, రాయలసీమల్లో అక్కడక్కడ పిడుగులతో వర్షాలు కురిశాయి. గంటకు 30 నుంచి 40 కి.మీ. వేగంతో గాలులు వీచాయి. గుంటూరు జిల్లా అమరావతిలో తొమ్మిది సెంమీ వర్షపాతం నమోదైంది. గుంటూరు, కృష్ణా, అల్లూరి జిల్లాల్లో అక్కడక్కడ వడగళ్ల వాన కురిసింది. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని పలు ప్రాంతాల్లో మంగళవారం అర్ధరాత్రి, బుధవారం సాయంత్రం కూడా ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో వర్షం కురిసింది. మొక్కజొన్న, అరటి, మామిడి పంటలు బాగా దెబ్బతిన్నాయి. కళ్యాణదుర్గం, బెళుగుప్ప, కూడేరు, ఆత్మకూరు, గార్లదిన్నె మండలాల్లో 67 ఎకరాల్లో రూ.1.95 కోట్ల విలువైన అరటి, 59 ఎకరాల్లో మొక్కజొన్న పంట దెబ్బతిన్నాయి. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండలో గంటపాటు భారీ వర్షం కురవడంతో వాగులు, వంకలు పొంగిపొర్లాయి. తలమరలో ఇళ్లలోకి నీరు చేరింది. కొత్తచెరువులో వడగండ్ల వాన కురిసింది. బుక్కపట్నంలో వడగండ్ల వానకు మామిడి పిందెలు రాలిపోయాయి. ఉమ్మడి కృష్ణా జిల్లాలో అపరాలసాగు కోత దశలో ఉండగా కురిసిన వర్షంతో మినుము.పెసర పంటలు దెబ్బతిన్నాయి. మామిడి చెట్లకూ నష్టం జరిగింది. పిడుగుపాటుకు ముగ్గురు మరణించారు. బాపట్ల జిల్లా భట్టిప్రోలు మండలం రాచూరులో మహిళా కౌలురైతు పెరవలి వనజ(35) పొలంలో కోతలు కోస్తుండగా పిడుగు పడటంతో మరణించారు. పల్నాడు జిల్లా నూజెండ్ల మండలం కొత్తనాగిరెడ్డిపల్లిలో మహిళా కూలీ పాటూరి సుబ్బరత్తమ్మ(55) మిర్చి పొలంలో కోతలకు వెళ్లి పిడుగు పడి మరణించారు. గుంటూరు జిల్లా తుళ్లూరులో బీఎసఆర్ కంపెనీలో సర్వేయర్ మేనేజర్‌గా పని చేస్తున్న కొయ్య శ్రీనివాసరావు(40) కూడా పిడుగు పాటుకు మరణించారు. కాగా.. బంగాళాఖాతంలో కొనసాగుతున్న అధికపీడనం ప్రభావంతో తేమగాలులు భూఉపరితలంపైకి వీస్తున్నాయి. గల్ఫ్ ఆఫ్ మన్నార్ నుంచి తమిళనాడు మీదుగా కర్ణాటక వరకు ఉపరితలద్రోణి విస్తరించింది. మరోవైపు కొద్దిరోజులుగా ఎండ తీవ్రతకు భూమి వేడెక్కింది. వీటన్నింటి ప్రభావంతో వాతావరణ అనిశ్చితి నెలకొని రాష్ట్రంలో అనేకచోట్ల బుధవారం ఉరుములు, మెరుపులు, పిడుగులు, భారీ గాలులతో వర్షాలు కురిశాయి. గురు, శుక్రవారాలు ఈదురుగాలులు, పిడుగులతో వర్షాలు కురుస్తాయని వాతావరణ అధికారి సముద్రాల జగన్నాథకుమార్ తెలిపారు.

ఇంధన కేంద్రాలే టార్గెట్

ఇజ్రాయెల్ దాడిలో భారీగా నష్టం వాటిల్లినట్లు తెలుస్తోంది. ఇరాన్ సైతం గల్ఫ్ అరబ్ దేశాల్లోని ఇంధన కేంద్రాలపై విరుచుకుపడింది. సౌదీ అరేబియాలో చమురు క్షేత్రాలు అధికంగా ఉన్న తూర్పు ప్రావిన్స్‌పై భారీగా క్షిపణులు ప్రయోగించింది. కువైట్, బహ్రెయిన్, ఖతార్, యూఏఈపైనా క్షిపణులు, డ్రోన్లతో నిప్పుల వర్షం కురిపించింది. ఆయా దేశాల్లో ఆయిల్, గ్యాస్ మౌలిక సదుపాయాలను, పెట్రోకెమికల్ కేంద్రాలను ధ్వంసం చేయడం తథ్యమని హెచ్చరించింది. వాటి శాటిలైట్ ఫొటోలు విడుదల చేసింది. అక్కడ పనిచేస్తున్న కార్మికులు, స్థానికులు సురక్షిత ప్రాంతాలకు వెళ్లిపోవాలని సూచించింది. పశ్చిమాసియా తాజా పరిణామాలతో అంతర్జాతీయ మార్కెట్‌లో బ్యారెల్ ముడిచమురు ధర 108 డాలర్లకు చేరుకుంది. యుద్ధం మొదలైన తర్వాత ఏకంగా 40 శాతం పెరిగింది. పెట్రో ఉత్పత్తుల ధరలు నానాటికీ పెరిగిపోతున్నాయి. ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థలు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. ఇంధన ధరలు పెరుగుతున్న కొద్దీ అమెరికాపై ఒత్తిడి పెరగడం తథ్యమని, తద్వారా యుద్ధం నుంచి అమెరికా సైన్యం నుంచి విరమించుకొనే అవకాశం ఉందని ఇరాన్ అంచనా వేస్తోంది. ఇజ్రాయెల్‌లోని టెల్ అవీవ్‌లో రైల్వే స్టేషన్‌పై ఇరాన్ సైన్యం దాడికి పాల్పడింది. దాంతో దేశవ్యాప్తంగా రైల్వే సేవలు నిలిచిపోయాయి. ఈ దాడిలో ప్రాణనష్టం జరగలేదు. పౌర మౌలిక సదుపాయాలను నేరుగా టార్గెట్ చేయడం సంచలనాత్మకంగా మారింది. సౌదీ అరేబియా రాజధాని రియాద్‌లోని దౌత్య కార్యాయాలపైనా ఇరాన్ దాడికి పాల్పడింది. ఇరాన్ ప్రయోగించిన రెండు డ్రోన్లను సౌదీ అరేబియా సైన్యం కూల్చివేసింది. ఇక్కడ అమెరికా ఎంబీసీతోపాటు ఇతర దేశాల దౌత్యకార్యాలయాలు ఉన్నాయి. రియాద్‌లో బుధవారం సాయంత్రం భారీగా పేలుళ్ల శబ్దాలు వినిపించాయి. ఇరాక్ రాజధాని బాగ్దాద్‌లోని అమెరికా ఎంబసీపై రెండో రోజు బుధవారం కూడా దాడి జరిగింది. ఇరాక్‌లోని అమెరికా స్థావరాలపై నిత్యం దాడులు జరుగుతున్నాయి.

ఇరాన్‌లో స్వీడన్ పౌరుడికి ఉరి

ఇరాన్ దక్షిణ ఫార్స్ ప్రావిన్స్‌లోని లారెస్తాన్ కౌంటీలో ఉన్న కోర్టు సముదాయంపై భారీ దాడి జరిగింది. ఈ ఘటనలో కనీసం 8 మంది మరణించారు. యుద్ధం మొదలైనప్పటి నుంచి ఇరాన్‌లో ఇప్పటిదాకా 1,300 మందికిపైగా బలయ్యారు. ఇజ్రాయెల్ నిఘా సంస్థ మొస్సాద్‌కు గూఢచారిగా పని చేస్తున్నాడన్న ఆరోపణలతో ఓ వ్యక్తిని ఇరాన్ ప్రభుత్వం ఉరితీసింది. ఇరాన్‌లోని కీలక ప్రాంతాల సమాచారాన్ని మొస్సాద్‌కు చేరవేస్తున్నాడని అతడిపై ఆరోపణలు వచ్చాయి. అతడు స్వీడన్ జాతీయుడని తెలిసింది. తమ పౌరుడికి ఉరిశిక్ష విధించడాన్ని స్వీడన్ విదేశాంగ శాఖ ఖండించింది. లెబనాన్‌లో హెజ్బొల్లా మిలిటెంట్లను అంతం చేయడమే లక్ష్యంగా ఇజ్రాయెల్ సైన్యం దాడులు కొనసాగిస్తోంది. బుధవారం రాజధాని బీరూట్‌లో అపార్టుమెంట్లపై క్షిపణులు ప్రయోగించింది. ఈ దాడుల్లో పది మందికిపైగా జనం మరణించారు. మిలిటెంట్ కార్యకలాపాల కోసం హెజ్బొల్లా పెద్ద ఎత్తున ధనం నిల్వ చేసుకున్న అపార్ట్‌మెంట్‌ను నేలమట్టం చేశామని ఇజ్రాయెల్ వెల్లడించింది.

5 వేల పౌండ్ల బంకర్ బస్టర్ బాంబులు

హార్మూజ్ జలసంధి సమీపంలో ఇరాన్ మిస్సైల్ కేంద్రాలను ధ్వంసం చేయడానికి అమెరికా సైన్యం 5 వేల పౌండ్ల(2,268 కిలోలు) బంకర్ బస్టర్ బాంబులను ప్రయోగించింది. ఈ విషయాన్ని యూఎస్ సెంట్రల్ కమాండ్ వెల్లడించింది. ఈ ప్రాంతంలో ఇరాన్ యాంటీషిప్ క్రూయిజ్ మిస్సైళ్లు విదేశీ నౌకలకు ముప్పుగా మారాయని, అందుకే శక్తివంతమైన బాంబులు ప్రయోగించినట్లు స్పష్టంచేసింది.

ఇరాన్ మంత్రి ఖతీబ్ మృతి

ఇజ్రాయెల్ దాడుల్లో ఇరాన్ నిఘా వ్యవహారాల మంత్రి ఇస్మాయిల్ ఖతీబ్ మరణించారు. మంగళవారం రాత్రి దాడుల్లో అతడు హతమైనట్లు ఇజ్రాయెల్ రక్షణ శాఖ మంత్రి కట్జ్ ప్రకటించారు. రాబోయే రోజుల్లో మరిన్ని ఆశ్చర్యకరమైన విషయాలు చూస్తారంటూ పేర్కొన్నారు. ఖతీబ్ మరణాన్ని ఇరాన్ అధికారిక టీవీ చానల్ సైతం ధ్రువీకరించింది. ఇది దారుణ హత్యాకాండ అని ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ స్పందించారు. ప్రతీకారంతో రగిలిపోతున్న ఇరాన్ సైన్యం ఇజ్రాయెల్‌తోపాటు గల్ఫ్ దేశాలపై దాడులకు దిగింది. ఇజ్రాయెల్‌లోని టెల్ అవీవ్ సమీపంలో ఇద్దరు మరణించారు. మంగళవారం ఇజ్రాయెల్ దాడుల్లో ఇరాన్ అత్యున్నత అధికారులు అలీ లారిజానీ, ఘోలమ్ రెజా సులేమానీ మరణించిన సంగతి తెలిసిందే. లారిజానీ మృతిపట్ల ఇరాన్ ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్ కోర్(ఐఆర్‌జీసీ) రగిలిపోతోంది. సెంట్రల్ ఇజ్రాయెల్‌పై బహుళ వార్‌హెడ్లతో కూడిన క్షిపణులు ప్రయోగించింది.

ఇజ్రాయెల్ గూఢచారికి ఇరాన్ గడ్డపై ఉరిశిక్ష

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ, ఇరాన్ సంచలన నిర్ణయం తీసుకుంది. ఇజ్రాయెల్ గూఢచార సంస్థ 'మొస్సాద్' కోసం పని చేస్తున్నాడనే ఆరోపణలతో కురుష్ కీవాని అనే వ్యక్తికి ఇరాన్ ప్రభుత్వం మరణశిక్షను అమలు చేసింది. దేశ రక్షణకు సంబంధించిన అత్యంత రహస్య సమాచారాన్ని విదేశీ శక్తులకు చేరవేసినట్లు సాక్ష్యాధారాలు లభించడంతో ఈ చర్య తీసుకున్నట్లు ఇరాన్ మీడియా వెల్లడించింది. కురుష్ కీవానిపై వచ్చిన ప్రధాన ఆరోపణలు ఏంటంటే.. ఇజ్రాయెల్‌కు చెందిన మొస్సాద్ ఏజెంట్‌గా వ్యవహరిస్తూ ఇరాన్ అంతర్గత భద్రతకు విఘాతం కలిగించడం, ఇరాన్ భద్రతా రంగానికి చెందిన అత్యంత కీలకమైన, రహస్య సమాచారాన్ని శత్రు దేశానికి అప్పగించడం, ఇరాన్‌లోని అత్యంత సున్నితమైన, నిషేధిత ప్రాంతాలకు సంబంధించిన ఫోటోలను తీసి, వాటిని మొస్సాద్‌కు పంపడం వంటి ఆరోపణలు ఉన్నాయి.

నేపాల్‌లో కూలిన హెలికాప్టర్

నేపాల్‌లో హెలికాప్టర్ ప్రమాదం జరిగింది. మృతదేహంతో కుటుంబ సభ్యులు అంత్యక్రియలకు వెళ్తున్న సమయంలో హెలికాప్టర్ ల్యాండింగ్ సమయంలో నియంత్రణ కోల్పోయి కూలిపోయింది. ఇందుకు సంబంధించిన వీడియో వైరల్ అవుతోంది. కాట్మాండు నుంచి ఒక మృతదేహాన్ని కుటుంబ సభ్యులు హెలికాప్టర్‌లో తరలిస్తున్నారు. ఖోటాంగ్ జిల్లా కెపిలాస్‌గఢిలో హెలికాప్టర్ ల్యాండింగ్ అవుతుండగా ఒక్కసారిగా నియంత్రణ కోల్పోయి కూలిపోయింది. ఈ ఘటనలో పైలట్‌కు స్వల్ప గాయాలు కాగా.. ఇతరులకు ఎలాంటి నష్టం జరగనట్లుగా తెలుస్తోంది. ప్రమాదంలో ఎవరూ మరణించలేదని జిల్లా మేజిస్ట్రేట్ రేఖా కండెల్ మీడియాకు తెలిపారు. ప్రత్యేక మిషన్‌లో భాగంగా హెలికాప్టర్ మృతదేహాన్ని కాట్మాండు నుంచి ఖోటాంగ్‌కు తరలిస్తోంది. రోడ్డు, విమానాశ్రయ సౌకర్యాలు పరిమితంగా ఉండే నేపాల్ పర్వత ప్రాంతంలో ఇలాంటి ప్రయాణాలు సర్వసాధారణంగా జరుగుతుంటాయి. ఈ క్రమంలోనే హెలికాప్టర్‌లో మృతదేహాన్ని తీసుకొస్తుండగా ల్యాండింగ్ సమయంలో కూలిపోయింది. పర్వత ప్రాంతాల్లో హెలికాప్టర్‌ను నడపడం అత్యంత ప్రమాదకరం. ఇరుకైన లోయలు, ఆకస్మిక వాతావరణ మార్పులు, తాత్కాలిక ల్యాండింగ్ ప్రదేశాలు పైలట్లకు తీవ్రమైన సవాళ్లను విసురుతాయి. ఈ కారణంగానే నేపాల్‌లో హెలికాప్టర్ ప్రమాదాలు తరచుగా జరుగుతుంటాయి. అయితే తాజా ప్రమాదానికి గల కచ్చితమైన కారణం ప్రస్తుతం తెలియరాలేదని అధికారులు అన్నారు. ఈ ప్రమాదం సాంకేతిక లోపమా? లేదంటే పైలట్ తప్పిదమా? లేదంటే వాతావరణం కారణమా? అనే విషయాలపై అధికారులు దర్యాప్తు చేయనున్నారు. సహాయక బృందం సంఘటనా స్థలానికి చేరుకుని శిథిలాలను పరిశీలించారు.

మాతో ప్రేమ, మోదీతో పెళ్లి

మీ అనుభవం, సేవలు ఎప్పటికీ గుర్తుండిపోతాయని స్పష్టంచేశారు. మాజీ ప్రధాని హెచ్.డి.దేవెగౌడ, విపక్ష నేత మల్లికార్జున ఖర్గే, ఎన్సీపీ అధినేత శరద్ పవార్‌పై మోదీ ప్రశంసల వర్షం కురిపించారు. రాజకీయ దిగ్గజాలైన ఆ ముగ్గురు నేతలు జీవితంలో సగానికి కంటే ఎక్కువ భాగం పార్లమెంట్ కార్యకలాపాల్లో పాలుపంచుకున్నారని చెప్పారు. అంకితభావంతో పార్లమెంట్‌కు హాజరయ్యారని, వారి నుంచి నేర్చుకోవాల్సింది ఎంతో ఉందని పేర్కొన్నారు. సుదీర్ఘకాలం పార్లమెంట్ సభ్యులుగా కొనసాగడం సాధారణ విషయం కాదన్నారు. రాజ్యసభ కార్యకలాపాల నిబంధనలను సమీక్షించాలని సభలో విపక్ష నేత మల్లికార్జున ఖర్గే కోరారు. సభను మరిన్ని ఎక్కువ రోజులు కొనసాగిస్తే ప్రజా సమస్యలు విస్తృతంగా చర్చకు వచ్చే అవకాశం ఉంటుందన్నారు. చట్టాల రూపకల్పనలో ప్రతిపక్ష సభ్యుల భాగస్వామ్యం మరింత పెరగాలని అభిప్రాయపడ్డారు. లేకపోతే పార్లమెంట్ ప్రతిష్ట బలహీనపడుతుందని చెప్పారు. 59 మంది సభ్యుల వీడ్కోలుపై ఖర్గే మాట్లాడారు. రాజకీయాల్లో ఉన్నవారికి ప్రజాజీవితం నుంచి రిటైర్‌మెంట్ ఉండదని వ్యాఖ్యానించారు. దేశానికి సేవ చేయాలన్న తపన కలిగిన నాయకులు రాజకీయాల్లో, ప్రజా జీవితంలో ఎన్నడూ అలసిపోరని వ్యాఖ్యానించారు. రాజ్యసభ సభ్యత్వం ముగు స్తున్న సభ్యులు ప్రజలకు ఎప్పటిలాగే సేవలందిస్తారని ఆశిస్తున్నట్లు చెప్పారు. మాజీ ప్రధాని దేవెగౌడ తనకు 54 ఏళ్లుగా తెలుసని, ఆయనతో కలిసి పనిచేశానని అన్నారు. ఏం జరిగిందో తెలియదు గానీ దేవెగౌడ తమతో డేటింగ్ చేసి, ప్రేమాయణం సాగించి, చివరికి మోదీని పెళ్లి చేసుకున్నారు అంటూ చమత్కరించారు. దీంతో సభలో మోదీతో సహా సభ్యులంతా నవ్వులు చిందించారు.

మూసీపై చర్చ కేటీఆర్ Vs శ్రీధర్ బాబు

మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. మూసీ ప్రాజెక్టుకు మేం వ్యతిరేకం కాదని, అందులో జరుగుతున్న దోపిడీకి మాత్రమే వ్యతిరేకమని అన్నారు. మూసీ ప్రక్షాళనపై ప్రభుత్వం చెబుతున్నదొక్కటి చేస్తున్నది మరొకటని అన్నారు. మూసీ డీపీఆర్ తయారు చేసేందుకే 18 నెలు పడుతుందని జనవరిలో మంత్రి చెప్పారని ఇప్పుడేమో డీపీఆర్ పూర్తయిందని అంటున్నారన్నారు. 18 నెలలు పడుతుందని చెప్పి రెండు నెలల్లోనే పూర్తి చేశారా అని నిలదీశారు. మూసీ డీపీఆర్ బాధ్యతలను మెయిన్ హార్ట్ సంస్థకు అప్పగించారు. కానీ ఈ సంస్థపై పాకిస్థాన్ ప్రభుత్వం రెడ్ కార్నర్ నోటీసులు పెట్టిందన్నారు.

డీపీఆర్ సభ ముందు పెట్టాలె

ప్రభుత్వం రూపొందించిన డీపీఆర్ తమకు అందలేని, అందుకే రుణం మంజూరు చేయలేదని ఏడీబీ చెబుతోందని అన్నారు. రుణానికి సూత్ర ప్రాయంగా ఏడీబీ అంగీకరించినట్టు గతంలో మంత్రి చెప్పారని గుర్తు చేశారు. డీపీఆర్‌ను సభ ముందు పెట్టాలని డిమాండ్ చేశారు. రుణానికి ఏడీబీ సూత్రప్రాయంగా అంగీకరించినట్లు గతంలో సభలో మంత్రి తెలిపారన్నారు. డీపీఆర్ ఇవ్వలేదని.. రుణం మంజూరు చేయలేదని ఏడీబీ స్పష్టం చేసిందని కేటీఆర్ చెప్పారు. రూ.16వేల కోట్లతో అయ్యే ప్రాజెక్టుకు సీఎం రేవంత్ రూ.లక్షన్నర కోట్లు అని చెప్పారన్నారు. మొదటి దశ రూ.7వేల కోట్లు అని మంత్రి శ్రీధర్ బాబు అంటున్నారని, ఇంతుకు ఎన్ని దశలు ఉంటాయని ప్రశ్నించారు. ఎన్ని నివాసాలు కూలుస్తారు? మంత్రి 1,435 నిర్మాణాలు అన్నారు.. గెజిట్‌లో 10వేల నిర్మాణాలు అని పేర్కొన్నారు. ఇందులో ఏది కరెక్ట్ అని ప్రశ్నించారు.

వాళ్లు నిర్ణయించిన బఫర్ జోనే!

గత ప్రభుత్వం నిర్ణయంచిన బఫర్ జోన్ నే తాము అనుసరిస్తున్నామని మంత్రి శ్రీధర్ బాబు చెప్పారు. కేటీఆర్ ఆరోపిస్తున్నట్లు డీపీఆర్ రెండు నెలల్లో పూర్తి కాలేదని, 2024 డిసెంబర్‌లో మెయిన్ హార్ట్ సంస్థకు బాధ్యతలు అప్పగించగా, 2026 ఫిబ్రవరిలో ఆ సంస్థ ప్రభుత్వానికి నివేదిక సమర్పించిందని వివరించారు. శాస్త్రీయంగా అధ్యయనం చేసిన తర్వాతే ఈ నివేదిక సిద్ధమైందని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ హయాంలో చేపట్టిన పనులను కాంగ్రెస్ సర్కారు నిలిపేసిందన్న ఆరోపణలను శ్రీధర్ బాబు తోసి పుచ్చారు. తాము ఏ ప్రాజెక్టు నిలిపివేయలేదని చెప్పారు. గత ప్రభుత్వం హయాంలో 30% ఎస్టీపీల పనులే జరిగితే తాము మిగతా 70% పూర్త చేశామని క్లారిటీ ఇచ్చారు.

బీఆర్ఎస్ వాకౌట్

మూసీ ప్రాజెక్టుపై ప్రభుత్వ వైఖరికి నిరసనగా తాము అసెంబ్లీ నుంచి వాకౌట్ చేస్తున్నట్టు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. "ప్రభుత్వం దగ్గర నిధులు లేవు.. ప్రణాళికలు లేవు. ఏడీబీ రుణం ఇవ్వలేదు. రూ.లక్షన్నర కోట్ల దోపిడీకి మేం వ్యతిరేకం. ప్రభుత్వ వైఖరికి నిరసనగా వాకౌట్ చేస్తున్నాం" అని కేటీఆర్ అన్నారు.

తొలివెలుగు
జాతీయ దిన పత్రిక
మన భాష.. మన పత్రిక..

రామన్నపేటలో సెగలు రేపిన సీపీఎం 'రాస్తారోకో'

- స్తంభించిన 65వ నంబర్ జాతీయ రహదారి
- కిలోమీటర్ల మేర నిలిచిన వాహనాలు.. ప్రయాణికుల అవస్థలు
- దీక్షా నిరసనకారులకు, పోలీసులకు మధ్య తోపులాట
- ఎమ్మెల్యే వేముల వీరేశం హామీతో సద్దుమణిగిన ఉద్రిక్తత

రామన్నపేట, మార్చి 18 (తొలివెలుగు న్యూస్): రామన్నపేట పట్టణంలో మంగళవారం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. స్థానిక సమస్యల పరిష్కారం కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో గత కొన్ని రోజులుగా సాగుతున్న నిరవధిక నిరాహార దీక్షలు ఒక్కసారిగా రణరంగంగా మారాయి. దీక్షలో ఉన్న నాయకుల ఆరోగ్యం క్షీణిస్తుండటంతో ఆగ్రహం చెందిన కార్యకర్తలు భారీ సంఖ్యలో రోడ్డెక్కారు. పట్టణంలోని ప్రధాన కూడలి అయిన సుభాష్ సెంటర్ వద్ద ఎన్‌ఎచ్-65 జాతీయ రహదారిపై సీపీఎం శ్రేణులు బైఠాయించాయి. "సమస్యలు పరిష్కరించాలి.. మొండివైఖరి వీడాలి" అంటూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా భారీ ఎత్తున నినాదాలు చేశారు. ఈ ఆకస్మిక రాస్తారోకోతో హైదరాబాద్-విజయవాడ వైపు వెళ్లే వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. దాదాపు రెండు గంటల పాటు ట్రాఫిక్ పూర్తిగా స్తంభించడంతో కిలోమీటర్ల మేర వాహనాల వరుసలు కనిపిపించాయి. ఎండ తీవ్రతకు తోడు ట్రాఫిక్ జామ్‌తో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు భారీగా తరలివచ్చి ఆందోళనకారులను చెదరగొట్టే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో పోలీసులకు, నిరసనకారులకు మధ్య తీవ్రస్థాయిలో వాగ్వాదం చోటుచేసుకుంది. ఇరువర్గాల మధ్య తోపులాట జరగడంతో సుభాష్ సెంటర్ పరిసరాల్లో ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు అదనపు బలగాలను రంగంలోకి దించి పరిస్థితిని అదుపులోకి తెచ్చే ప్రయత్నం చేశారు.

రంగంలోకి ఎమ్మెల్యే.. అధికారుల హామీ:

పరిస్థితి తీవ్రతను గమనించిన స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం తక్షణమే స్పందించారు. ఆయన జిల్లా కలెక్టర్, ఆర్డీవోలతో ఫోన్లో మాట్లాడి సమస్య తీవ్రతను వివరించారు. అనంతరం దీక్షా శిబిరాన్ని సందర్శించి, అధికారుల నుంచి లభించిన సానుకూల హామీని నాయకులకు వివరించారు. త్వరలోనే ఉన్నతాధికారులు వచ్చి సమస్యలపై చర్చిస్తారని హామీ ఇవ్వడంతో సీపీఎం నాయకులు తమ రాస్తారోకోను విరమించారు. దీక్షలో ఉన్న నాయకుల ఆరోగ్యాన్ని వైద్య బృందం నిశితంగా పర్యవేక్షిస్తోంది. ప్రస్తుతం రామన్నపేటలో పరిస్థితి ప్రశాంతంగా ఉన్నప్పటికీ, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భద్రతను పర్యవేక్షిస్తున్నారు.

మతసామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ విందు

- ముస్లిం సోదరులతో కలిసి ఉపవాస విరమణ చేసిన ఎస్ఐ నాగరాజు
- ఘనంగా కానిస్టేబుల్ ప్రవీణ్‌కు సన్మానం

రామన్నపేట, మార్చి 18 (తొలివెలుగు న్యూస్): రంజాన్ పండుగ పర్వదినాన్ని పురస్కరించుకొని ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయడం అభినందనీయమని స్థానిక ఎస్సై డి. నాగరాజు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని నాగార్జున స్కూల్‌లో కరస్పాండెంట్ డాక్టర్ నకిరేకంటి నాగరాజు, ప్రిన్సిపాల్ రేఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇఫ్తార్ విందు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ నాగరాజు మాట్లాడుతూ.. మతసామరస్యానికి ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని పేర్కొన్నారు. రంజాన్ పర్వదిన శుభాకాంక్షలు తెలుపుతూ, ఉపవాస దీక్షలో ఉన్న ముస్లిం సోదరులతో కలిసి ఉపవాస విరమణ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఉత్తమ పోలీసు అవార్డు అందుకున్న కానిస్టేబుల్ ప్రవీణ్ కుమార్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎం.ఏ. వాహిద్, ఎండి జమీరుద్దీన్, ఎండి అన్వర్, ఎండి అక్రమ్, ఎస్‌కే చాంద్, అంజాద్, ఆరిఫ్, విజయశ్రీ, వినీష, స్వప్న, మీర్జా అక్రమ్, నరసింహ, బొడ్డు బిక్షపతి, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతోనే గ్రామాభివృద్ధి.. వార్డు సభ్యులకు ప్రత్యేక శిక్షణ

- ఈనెల 23 నుంచి తరగతులు
- రెండు బ్యాచ్‌లుగా 205 మంది సభ్యులకు తర్ఫీదు
- వివరాలు వెల్లడించిన ఎంపీడీవో నాగవేణి

రాజపేట, మార్చి 18 (తొలివెలుగు న్యూస్): మండలంలోని గ్రామ పంచాయతీ వార్డు సభ్యులకు పంచాయతీరాజ్ చట్టంపై పూర్తిస్థాయి అవగాహన కల్పించేందుకు ఈనెల 23వ తేదీ నుంచి ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో నాగవేణి తెలిపారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీఓ ఆవుల కిషన్‌తో కలిసి ఆమె విలేకరులతో మాట్లాడారు. మండలంలోని 23 గ్రామ పంచాయతీలకు చెందిన 205 మంది వార్డు సభ్యులకు రెండు విడతల్లో ఈ శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. ఒక్కో బ్యాచ్‌కు ఆరు రోజుల పాటు అవగాహన కల్పించనున్నట్లు వివరించారు. తొలి విడత శిక్షణ ఈనెల 23వ తేదీ నుంచి 28 వరకు జరుగుతుంది. ఇందులో రఘునాథపురం, చల్లూరు, వెంకటాపురం, సోమవారం, కాల్వపల్లి, కొత్తజాల, బేగంపేట, మొల్లగూడెం, బొందుగుల, పారుపల్లి, బూరుగుపల్లి గ్రామాలకు చెందిన సభ్యులు పాల్గొంటారు. రెండో విడత శిక్షణ ఈనెల 30 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు నిర్వహిస్తారు. ఇందులో జాల, కొండ్రెడ్డి, చెరువు కుర్రారం, లక్ష్మక్కపల్లి, బసంతాపురం, నరసాపురం, పాముకుంట, పుట్టగూడెం, రాజపేట, రేణిగుంట, సింగారం, నమిల గ్రామాల సభ్యులు పాల్గొంటారని తెలిపారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో జరిగే ఈ శిక్షణకు ప్రజాప్రతినిధులందరూ సకాలంలో హాజరై చట్టంపై అవగాహన పెంచుకోవాలని కోరారు.

గాయని శోభారాణికి ఘన సత్కారం

- అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని పురస్కారం
- హైదరాబాద్‌లో వేడుకగా కార్యక్రమం

రాజపేట, మార్చి 18 (తొలివెలుగు న్యూస్): రాజపేట మండలానికి చెందిన ప్రముఖ గాయని పబ్బోజు శోభారాణికి అరుదైన గౌరవం దక్కింది. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని హైదరాబాద్‌లో స్ఫూర్తి ఆర్ట్స్ వర్ధిని ప్రియ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆమెను ఘనంగా సత్కరించారు. సంగీత రంగంలో ఆమె చేస్తున్న కృషిని గుర్తించి ఈ పురస్కారాన్ని అందజేశారు. కార్యక్రమంలో వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు పాల్గొని శోభారాణిని అభినందించారు. సినిమా, రాజకీయ, వ్యాపార రంగాల ప్రముఖుల సమక్షంలో జరిగిన ఈ వేడుకలో ఆమెకు శాలువా కప్పి, జ్ఞాపికను అందజేశారు. రాజపేట మట్టిలో పుట్టిన కళాకారిణి రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వేద మంత్రోచ్చారణల మధ్య రుద్రాభిషేకాలు

- సాయి మందిరంలో మాస శివరాత్రి వేడుకలు
- భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించిన భక్తులు

రాజపేట, మార్చి 18 (తొలివెలుగు న్యూస్): రాజపేట మండల కేంద్రంలోని శ్రీ రామకృష్ణ సాయి మందిరంలో మాస శివరాత్రి పురస్కరించుకొని మంగళవారం రాత్రి పరమశివుడికి విశేష పూజలు నిర్వహించారు. ఆలయ శాశ్వత గౌరవ అధ్యక్షులు నంగునూరు చంద్రశేఖర్ పర్యవేక్షణలో ట్రస్ట్ సభ్యులు ఈ వేడుకను శాస్త్రోక్తంగా జరిపారు. ఆలయ అర్చకులు చలివేదుల వెంకట రామకృష్ణ ప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో వేద మంత్రోచ్చారణల మధ్య లఘున్యాస పూర్వక రుద్రాభిషేకం జరిగింది. ఈ పూజా కార్యక్రమంలో రంగ నర్సింలు-లక్ష్మి, ఉప్పల రమేష్-స్వప్న దంపతులు సంప్రదాయ దుస్తుల్లో పాల్గొని పూజలు నిర్వహించారు. జై శ్రీమన్నారాయణ భక్త బృందం సభ్యులు స్వామివారికి పంచామృత ఫలరస అభిషేకాలు చేశారు. అనంతరం శివుడిని ప్రత్యేకంగా అలంకరించి మంగళహారతులు ఇచ్చారు. మాస శివరాత్రి విశిష్టతను భక్తులకు అర్చకులు వివరించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఎంఈఓ బల్ల దామోదర్‌వరలక్ష్మి దంపతులు, డాక్టర్ బోగ జ్ఞానేందర్, నంగునూరు రాజు, చామకూర భద్రయ్య, కూనూరు బిక్షపతి, భోగ లతా, బిర్రు భాగ్యలక్ష్మి, నాళ్ల పద్మ తదితరులు పాల్గొన్నారు.

బొందుగుల కుర్మ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

- అధ్యక్షుడిగా బండ ఆంజనేయులు
- ప్రధాన కార్యదర్శిగా గవ్వల బాలయ్య

రాజపేట, మార్చి 18 (తొలివెలుగు న్యూస్): మండలంలోని బొందుగుల గ్రామ కుర్మ సంఘం నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ స్థాయిలో కుర్మల సంక్షేమం, ఐక్యత కోసం ఈ నూతన కమిటీని ఏర్పాటు చేసినట్లు సభ్యులు తెలిపారు. సంఘం అధ్యక్షుడిగా బండ ఆంజనేయులు, ఉపాధ్యక్షుడిగా మర్ల సమ్మయ్య, ప్రధాన కార్యదర్శిగా గవ్వల బాలయ్యలను ఎన్నుకున్నారు. అలాగే సహాయ కార్యదర్శిగా బాల్ద భాను, కోశాధికారిగా బల్ల పెద్దా బాపు బాధ్యతలు చేపట్టారు. కార్యవర్గ సభ్యులుగా మర్ల పెద్దమల్లేశం, బాల్ద కరుణాకర్, బుగ్గ కరుణాకర్, బాల్ద కనక రాజు, మాపు చిన్న సిద్ధులు, జెట్టా ఆంజనేయులను నియమించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన సభ్యులు మాట్లాడుతూ.. కుర్మ సంఘం బలోపేతానికి, కుల బాంధవుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని పేర్కొన్నారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి

- కలెక్టర్ అనురాగ్ జయంతికి జాల గ్రామ ప్రతినిధుల వినతి
- ప్రభుత్వ భూముల కబ్జాపై ఫిర్యాదు

రాజపేట, మార్చి 18 (తొలివెలుగు న్యూస్): మండలంలోని జాల గ్రామ పరిధిలో జరుగుతున్న అక్రమ గృహ నిర్మాణాలు, ప్రభుత్వ భూముల కబ్జాలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ గ్రామ పంచాయతీ పాలకవర్గం, గ్రామ పెద్దలు బుధవారం జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలో ఎటువంటి అనుమతులు లేకుండా కొందరు అక్రమంగా కట్టడాలు నిర్మిస్తున్నారని, ప్రభుత్వ భూములను సైతం ఆక్రమిస్తున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. గ్రామ పంచాయతీ అనుమతి లేకుండా చేపట్టిన పనులను వెంటనే నిలిపివేయాలని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. భవిష్యత్తులో చేపట్టే ఏవైనా కొత్త నిర్మాణాలకు తప్పనిసరిగా పంచాయతీ అనుమతి ఉండాలని పాలకవర్గం పేర్కొంది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గంధమల్ల నవనీత నరసింహులు, ఉప సర్పంచ్ కొల్లూరి లావణ్య కర్ణాకర్, వార్డు సభ్యులు ఠాగూర్ భగత్ సింగ్, సౌజన్య, ధనమ్మ, బాలయ్య, ముత్యంరెడ్డి, లక్ష్మి, పరమేశ్వర్ రెడ్డి, మధుసూధన్ రెడ్డి, సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించాలని కలెక్టర్ హరిత

జిల్లా కలెక్టర్ హరిత బుధవారం జిల్లా పరిషత్ బాలికల సెకండరీ పాఠశాలలో ఏర్పాటు చేసిన పదవ తరగతి వార్షిక పరీక్ష కేంద్రానికి అకస్మిక తనిఖీ నిర్వహించారు. పరీక్షా కేంద్రంలో పరిస్థితులను పరిశీలించిన కలెక్టర్, పరీక్షలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలొప్పకుండా ప్రశాంతంగా నిర్వహించాల్సిన దిశగా అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో 38 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు, 6,948 మంది విద్యార్థులు ఈ వార్షిక పరీక్షలకు హాజరైనట్లు తెలిపారు. ప్రతి పరీక్షా కేంద్రంలో సీసీ కెమెరాలు, త్రాగునీరు, సరైన వెలుతురు ఏర్పాట్లు జాగ్రత్తగా చేసినట్లు ఆయన పేర్కొన్నారు. పరీక్షల సందర్భంలో వైద్య సిబ్బంది ఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచమని కలెక్టర్ ఆదేశించారు. అలాగే, జిల్లాలో 2 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు ప్రతి కేంద్రానికి నియమించబడి, సిట్టింగ్స్ స్క్వాడ్ బృందాలు విధులు నిర్వహిస్తున్నాయని తెలిపారు.

ఆసుపత్రి సాధన దీక్షలకు పద్మశాలీల మద్దతు

- వంద పడకల ఆసుపత్రిగా మార్చాలని డిమాండ్
- దీక్షా శిబిరాన్ని సందర్శించిన సంఘం నాయకులు

రామన్నపేట, మార్చి 18 (తొలివెలుగు న్యూస్) : రామన్నపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని వంద పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ(ఎం) మండల కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక నిరాహార దీక్షలు బుధవారం మూడో రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షా శిబిరాన్ని పట్టణ పద్మశాలి సంఘం నాయకులు సందర్శించి, తమ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు రచ్చ యాదగిరి మాట్లాడుతూ.. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా రామన్నపేటలో వైద్య సదుపాయాలు మెరుగుపడాల్సిన అవసరం ఉందన్నారు. వంద పడకల ఆసుపత్రి ఏర్పాటు వల్ల చుట్టుపక్కల గ్రామాల పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందుతుందని, ప్రభుత్వం తక్షణమే స్పందించాలని కోరారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం ప్రధాన కార్యదర్శి కారంకొండ నాగభూషణ్, నాయకులు మహేశ్వరం అశోక్, కైరంకొండ నందకుమార్, కొంగరి నరసింహ, చిందం ఉమాకాంతం, గూడెల్లి దామోదర్, అప్పం లింగస్వామి, గందూరి నరేష్, అప్పం సంతోష్, గంజి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లయ్య ఆశయ సాధనే లక్ష్యం.. సీపీఎం నివాళి

- ఘనంగా మునికుంట్ల ఎల్లయ్య 5వ వర్ధంతి
- వంద పడకల ఆసుపత్రి కోసం ఉద్యమిస్తాం: లెనిన్

రామన్నపేట, మార్చి 18 (తొలివెలుగు న్యూస్): రామన్నపేట మండల సీనియర్ నాయకులు, అమరజీవి కామ్రేడ్ మునికుంట్ల ఎల్లయ్య 5వ వర్ధంతిని బుధవారం రామన్నపేటలో ఘనంగా నిర్వహించారు. సీపీఎం పట్టణ కార్యదర్శి మునికుంట్ల లెనిన్, మండల నాయకులు బావండ్లపల్లి బాలరాజు ఎల్లయ్య స్థూపం వద్ద జెండా ఆవిష్కరించి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎల్లయ్య పేద కుటుంబంలో జన్మించినా, అణగారిన వర్గాల కోసం నిరంతరం శ్రమించారని కొనియాడారు. కార్యకర్తలకు జాతీయ, అంతర్జాతీయ పరిణామాలను వివరిస్తూ వారిని గొప్ప పోరాటయోధులుగా తీర్చిదిద్దిన ఘనత ఆయనదేనన్నారు. ఆయన ఇచ్చిన ఉద్యమ స్ఫూర్తితో రామన్నపేట ప్రభుత్వ ఆసుపత్రిని వంద పడకల ఆసుపత్రిగా మార్చే వరకు పోరాటం ఆపేది లేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు గాదె నరేందర్, సత్యం, నీల అయిలయ్య, పిఎన్‌ఎం నాయకులు గంటెపాక శివ, శ్రీకృష్ణ, నాగటి లక్ష్మణ్, బాపూచారి, కూనూరు మల్లేశం, మెట్టు శ్రవణ్, ఎర్ర కాటమయ్య, తాళ్లపల్లి జితేందర్, జంపాల ఉమాపతి, రాసాల రమేష్, సురేష్, తరిగొప్పుల వెంకటరెడ్డి, ఎండి రషీద్, మల్లేష్, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

డిపిఆర్ఓ అరుంధతికి 'జర్నలిస్టుల' నీరాజనం

- అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేళ అరుదైన గౌరవం
- టీయూడబ్ల్యూజే (ఐజేయు) ఆధ్వర్యంలో వేడుక
- యూనియన్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపిన అధికారిణి

యాదాద్రి భువనగిరి, మార్చి 18 (తొలివెలుగు న్యూస్): అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని యాదాద్రి భువనగిరి జిల్లా సమాచార పౌరసంబంధాల అధికారి (డిపిఆర్ఓ) యు. అరుంధతిని టీయూడబ్ల్యూజే (ఐజేయు) జిల్లా విభాగం ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సన్మానించారు. కలెక్టరేట్‌లోని ఆమె కార్యాలయంలో యూనియన్ ప్రతినిధులు శాలువా కప్పి, మెమెంటోను అందజేసి గౌరవించారు. ఈ సందర్భంగా డిపిఆర్ఓ అరుంధతి మాట్లాడుతూ.. మహిళా అధికారిణిగా తన సేవలను గుర్తించి, యూనియన్ ఆధ్వర్యంలో సన్మానించడం సంతోషంగా ఉందన్నారు. జర్నలిస్టుల సంక్షేమానికి, సమాచార రంగానికి మధ్య సమన్వయం కొనసాగిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు ఎం. నరసింహులు, జిల్లా కార్యదర్శి పోతంశెట్టి కరుణాకర్, ఐజేయు కౌన్సిల్ సభ్యుడు జీవీ శ్రీనివాస్, అక్రిడేషన్ కమిటీ సభ్యుడు వెలిమినేటి జహంగీర్, మాజీ అధ్యక్షుడు జి. కృష్ణారెడ్డి, యూనియన్ నాయకులు కందుకూరు సోమయ్య, పురుగుల మల్లేశం, గుండు ప్రసాద్, తాళ్ల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రీన్ గ్రోవ్‌లో 'పరాభవ' ఉగాది వైభవం

- షడ్రుచుల సమ్మేళనంతో వేడుకలు
- మామిడి తోరణాలతో పాఠశాల ముస్తాబు
- పాఠశాల చైర్‌పర్సన్ బండి వీణా అనిల్ కుమార్ రెడ్డి

చౌటుప్పల్, మార్చి 18 (తొలివెలుగు న్యూస్): చౌటుప్పల్ పట్టణ పరిధిలోని గ్రీన్ గ్రోవ్ పాఠశాలలో తెలుగు నూతన సంవత్సరాది 'ఉగాది' వేడుకలను బుధవారం అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. ముగిసిన 'విశ్వావసు' నామ సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ, నూతనంగా అడుగుపెట్టిన 'పరాభవ' నామ సంవత్సరానికి విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణమంతా పండుగ వాతావరణం సంతరించుకుంది. విద్యార్థులు సాంప్రదాయ దుస్తుల్లో అలరించారు. పాఠశాల ఆవరణాన్ని మామిడి తోరణాలు, పూలతో శోభాయమానంగా అలంకరించారు. ప్రత్యేక పూజా కార్యక్రమాల అనంతరం షడ్రుచుల మేళవింపుతో కూడిన ఉగాది పచ్చడిని అందరికీ వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్‌పర్సన్ బండి వీణా అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. ఉగాది పచ్చడిలోని తీపి, వొగరు, చేదు వంటి ఆరు రుచులు జీవితంలోని సుఖదుఃఖాల కలయికకు ప్రతీకలని పేర్కొన్నారు. చైత్ర శుద్ధ పాడ్యమితో ప్రారంభమయ్యే తెలుగు సంవత్సరం కాలగమనంలో ప్రకృతిలో వచ్చే మార్పులకు అద్దం పడుతుందని, తిథి వార నక్షత్రాల ఆధారంగా పంచాంగం రూపొందించబడుతుందని వివరించారు. అనంతరం పాఠశాల డైరెక్టర్ ఎస్. లక్ష్మి మాట్లాడుతూ.. ఈ నూతన సంవత్సరం అందరి జీవితాల్లో విజయాలను నింపాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పల్లివాడ పాఠశాలలో '90 రోజుల ప్రణాళిక' పరిశీలన

- విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసిన సర్పంచ్, అధికారులు
- వృథా నీటి నివారణకు సోక్‌పిట్‌ల నిర్మాణం ప్రారంభం
- ఘనంగా ముందస్తు ఉగాది వేడుకలు

రామన్నపేట, మార్చి 18 (తొలివెలుగు న్యూస్): గ్రామ అభివృద్ధి కోసం చేపట్టిన 90 రోజుల ప్రణాళికలో భాగంగా బుధవారం స్థానిక ప్రభుత్వ పాఠశాలను సర్పంచ్ కంభంపాటి శ్రీనివాసులు అధికారులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో అమలవుతున్న విద్యా విధానాన్ని, మౌలిక వసతులను ఆయన అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి వెంకటేశం, ప్రధానోపాధ్యాయురాలు సుధారాణి, ఉపాధ్యాయుడు మధు తదితరులు మధ్యాహ్న భోజనం చేశారు. భోజనం నాణ్యతను స్వయంగా పరీక్షించి సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాల ఆవరణలో విద్యార్థులు చేతులు, కాళ్లు కడుక్కునే చోట నీరు నిలిచి బురదగా మారుతున్న విషయాన్ని సర్పంచ్ గమనించారు. దీని పరిష్కారానికి ఉపాధి హామీ నిధులతో కమ్యూనిటీ సోక్‌పిట్‌ల (ఇంకుడు గుంతల) నిర్మాణాన్ని ఇంజనీర్ ప్రవీణ్‌తో కలిసి ప్రారంభించారు. వృథా నీరు నిల్వ ఉండకుండా చూడడం వల్ల దోమల నివారణతో పాటు పరిశుభ్రత పెరుగుతుందని సర్పంచ్ పేర్కొన్నారు. ఉగాది పండుగను పురస్కరించుకొని ముందస్తు ఉగాది సంబరాలను పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు స్వయంగా ఉగాది పచ్చడిని తయారు చేశారు. షడ్రుచుల సమ్మేళనమైన పచ్చడిని సర్పంచ్, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులకు అందించి ఆశీస్సులు తీసుకున్నారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ సెక్రటరీ వెంకటేశం, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుధారాణి, ఉపాధ్యాయులు, ఉపాధి హామీ ఇంజనీరు ప్రవీణ్, టెక్నికల్ అసిస్టెంట్ సుచరిత, కృష్ణ, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. గ్రామాభివృద్ధికి ఈ చర్యలు దోహదపడతాయని స్థానికులు అభిప్రాయపడ్డారు.

సామాన్యుడికి న్యాయం జరిగినప్పుడే 'వినియోగదారుల' దినోత్సవానికి సార్థకత

- కల్తీ వస్తువుల పట్ల అప్రమత్తంగా ఉండాలి: అదనపు కలెక్టర్
- టోల్ ఫ్రీ నంబరు 15100పై అవగాహన

యాదాద్రి భువనగిరి, మార్చి 18 (తొలివెలుగు న్యూస్): వస్తువుల నాణ్యత, పరిమాణం, ధరల గురించి తెలుసుకునే హక్కు ప్రతి వినియోగదారుడికి ఉంటుందని జిల్లా రెవిన్యూ అదనపు కలెక్టర్ వెంకారెడ్డి పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో 'సురక్షితమైన ఉత్పత్తులు-నమ్మకమైన వినియోగదారులు' అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. వినియోగదారుల పరిరక్షణ చట్టాలపై సామాన్యులకు సైతం అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. కల్తీ వస్తువులను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నాగిరెడ్డి మాట్లాడుతూ.. మహిళా సంఘాల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో వినియోగదారుల హక్కులపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఉచిత న్యాయ సేవ కోసం టోల్ ఫ్రీ నంబరు 15100ను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారి రోజారాణి, సివిల్ సప్లై కార్పొరేషన్ జిల్లా మేనేజర్ హరికృష్ణ, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ, మెట్రాలజీ అధికారి వెంకటేశ్వర్లు, వినియోగదారుల ఫోరం సభ్యులు పాల్గొన్నారు.

జాతీయ దిన పత్రిక
తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..

ఎమ్మెల్యే మందుల సామెల్ నివాసంపై దాడి హేయం

- ప్రజాస్వామ్యమా.. మనువాదమా?: గంధమల్ల యాదగిరి
- దళిత ప్రజాప్రతినిధులకు రక్షణ కల్పించాలని డిమాండ్

యాదాద్రి భువనగిరి, మార్చి 18 (తొలివెలుగు న్యూస్): తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్ నివాసంపై జరిగిన దాడిని బహుజన సంఘర్షణ సమితి (బి.ఎస్.ఎస్) వ్యవస్థాపక అధ్యక్షుడు గంధమల్ల యాదగిరి తీవ్రంగా ఖండించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రశ్నించే గొంతులను భయపెట్టేందుకే మనువాద శక్తులు ఇలాంటి దాడులకు తెగబడుతున్నాయని ఆరోపించారు. రాజ్యాంగబద్ధంగా ఉన్న హక్కులను వినియోగించుకుంటే దాడులు చేయడం ప్రజాస్వామ్యానికే ప్రమాదకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక దళిత ఎమ్మెల్యేను తక్కువ చేసి మాట్లాడటం, ఆయన ఇంటిపై దాడులకు దిగడం వెనుక స్పష్టమైన కుట్ర దాగి ఉందని విమర్శించారు. దళిత, బహుజన ప్రజాప్రతినిధులపై దాడులు చేస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. ఈ ఘటనకు బాధ్యులైన వారిని తక్షణమే అరెస్టు చేయాలని, బాధిత ఎమ్మెల్యేకు పటిష్టమైన భద్రత కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం బహుజన సమాజం ఐక్యంగా పోరాడుతుందని స్పష్టం చేశారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వ తోడ్పాటు

- లబ్ధిదారుకు ఆటో పంపిణీ చేసిన కలెక్టర్ అనురాగ్ జయంతి
- ఏజీవీవై పథకం కింద వాహనం అందజేత

యాదాద్రి భువనగిరి, మార్చి 18 (తొలివెలుగు న్యూస్): గ్రామీణ ప్రాంత మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి సూచించారు. బుధవారం కలెక్టరేట్ ప్రాంగణంలో ఎన్ఆర్ఎల్ఎం ఆధ్వర్యంలోని ఆజీవిక గ్రామీణ ఎక్స్‌ప్రెస్ యోజన (ఏజీవీవై) పథకం కింద మోటకొండూరు గ్రామానికి చెందిన నాంపల్లి భార్గవికి ఆటోను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. స్వయం ఉపాధి అవకాశాలను పెంపొందించుకోవడం ద్వారా మహిళలు సమాజంలో గౌరవప్రదంగా జీవించవచ్చన్నారు. రవాణా సౌకర్యాలు మెరుగుపరచడంతో పాటు మహిళలకు ఆదాయం కల్పించడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిన్న వ్యాపారాలతోనే ఆర్థిక బలోపేతం

- గాన్విక కిరాణం దుకాణాన్ని ప్రారంభించిన ఇరుగదిండ్ల భాస్కర్
- రూ. 25 వేల ఆర్థిక సాయం అందజేత

చౌటుప్పల్, మార్చి 18 (తొలివెలుగు న్యూస్): యువత స్వయం ఉపాధి దిశగా అడుగులు వేసి వ్యాపార రంగంలో రాణించాలని ఇఎల్‌వి భాస్కర్ ఫౌండేషన్ చైర్మన్ ఇరుగదిండ్ల భాస్కర్ ఆకాంక్షించారు. మున్సిపాలిటీ పరిధిలోని తంగడపల్లి రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన 'గాన్విక' కిరాణం దుకాణాన్ని బుధవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుద్యోగ యువత కేవలం ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా చిన్న స్థాయి వ్యాపారాలను ప్రారంభించి ఆర్థికంగా స్థిరపడాలని సూచించారు. స్థానికంగా చిన్న వ్యాపారాలు అభివృద్ధి చెందడం ద్వారా గ్రామీణ, పట్టణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. యువతను ప్రోత్సహించే ఉద్దేశంతో ఫౌండేషన్ తరఫున రూ.25 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. కష్టాల్లో ఉన్నవారికి, ఎదగాలనే తపన ఉన్న వారికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని భాస్కర్ తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు కొయ్యడ శేఖర్ గౌడ్, ఆలె శ్రీలత చిరంజీవి, ఊదరి యాదయ్య, ఇఎల్‌వి భాస్కర్ ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

భూకబ్జాదారులారా ఖబడ్దార్!.. రేవంత్ సర్కార్‌పై గొంగిడి సునీత ధ్వజం

- 22 చట్టం పేరుతో భూములు గుంజుకునే కుట్ర ఆరోపణ
- సర్వేల పేరుతో ప్రజల్లో భయాందోళనలు సృష్టిస్తున్నారంటూ విమర్శలు
- కేహెచ్ఆర్ ఫౌండేషన్ చలివేంద్రం ప్రారంభం

ఆత్మకూర్ (ఎం), మార్చి 18 (తొలి వెలుగు న్యూస్): మండల కేంద్రంలో కేహెచ్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నూతన చలివేంద్రాన్ని బుధవారం మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత మహేందర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పేద ప్రజల కోసం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఫౌండేషన్ చైర్మన్ కొప్పుల హరిదీప్ రెడ్డి, వారి బృందాన్ని అభినందించారు. అనంతరం బీఆర్ఎస్ మండల పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తోందని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీ హామీలను అమలు చేయడంలో విఫలమై, వివిధ అంశాలను ముందుకు తెచ్చి ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు. హైడ్రా, మూసీ ప్రక్షాళన, ఫ్యూచర్ సిటీ, భూదాన్ భూముల అంశాలను ప్రస్తావిస్తూ ప్రభుత్వం ప్రజల్లో గందరగోళం సృష్టిస్తోందన్నారు. 1908 ప్రాపర్టీ చట్టం 22ఎ కింద భూములపై సర్వేలు నిర్వహించడం ద్వారా గ్రామాల్లో ప్రజలను భయపెడుతున్నారని ఆరోపించారు. గ్రామపంచాయతీల్లో ఇంటి యజమానుల వివరాలు సేకరించడం వెనుక అసలు ఉద్దేశం ఏమిటో ప్రభుత్వం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో 58, 59 జీవోలు, ఎల్ఆర్ఎస్ పథకాల ద్వారా భూసంబంధిత సమస్యలకు పరిష్కారం చూపించామని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త వివాదాలకు తెరతీస్తోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సీలింగ్, అసైన్డ్, భూదాన్ భూములపై సర్వేలు నిర్వహించడం ప్రజల్లో భయాందోళనలు కలిగిస్తోందని విమర్శించారు. తెలంగాణ ప్రజల ఆస్తులకు ఎలాంటి నష్టం జరిగినా బీఆర్ఎస్ పార్టీ మౌనంగా ఉండదని, అవసరమైతే ఉద్యమాలకు సిద్ధమని హెచ్చరించారు. "కాంగ్రెస్ భూకబ్జాదారులారా ఖబడ్దార్" అంటూ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కార్యక్రమంలో కేహెచ్ఆర్ ఫౌండేషన్ అధినేత కొప్పుల హరిదీప్ రెడ్డి, భాష బోయిన ఉప్పలయ్య, కోరే బిక్షపతి, సోలిపురం అరుణ, యాస కవిత, యాస ఇంద్రారెడ్డి, పూర్ణ చందర్ రాజు, కాలే మల్లేష్, సత్తయ్య, అబ్బ సాయిలు, యాస అంజిరెడ్డి, పురుషోత్తం రెడ్డి, గట్టు శంకర్, బూడిది వెంకన్న, లోడి మధు తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పదవ తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

- తుర్కపల్లిలో పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్ అనురాగ్ జయంతి
- నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు: కలెక్టర్ హెచ్చరిక

తుర్కపల్లి, మార్చి 18 (తొలివెలుగు న్యూస్): జిల్లాలో పదవ తరగతి వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అధికారులను ఆదేశించారు. బుధవారం తుర్కపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హై స్కూల్‌లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజరు, గైర్హాజరు వివరాలను సంబంధిత కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లను అడిగి తెలుసుకున్నారు. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద త్రాగునీటి సదుపాయం తప్పనిసరిగా ఉండాలని సూచించారు. విద్యార్థులను ప్రధాన గేటు వద్ద పూర్తిస్థాయిలో తనిఖీ చేసిన అనంతరం మాత్రమే పరీక్షా కేంద్రంలోకి అనుమతించాలని ఆదేశించారు. ప్రశ్నపత్రాలు, జవాబు పత్రాల భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, పోలీస్ భద్రతతోనే వాటి డిపాజిట్ నిర్వహించాలని చెప్పారు. పరీక్షా కేంద్రాల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేసి, అనుమతి లేని వ్యక్తులను లోపలికి అనుమతించవద్దని స్పష్టం చేశారు. కేంద్రాల పరిసర ప్రాంతాల్లో ఉన్న జీరాక్స్ కేంద్రాలను పరీక్షల సమయంలో మూసివేయాలని సూచించారు. జిల్లాలో ఎక్కడా మాల్ ప్రాక్టీస్‌కు అవకాశం లేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, పరీక్షల నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం వహించవద్దని కలెక్టర్ హెచ్చరించారు. కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

బుచ్చిరెడ్డి చిత్రపటానికి రాజగోపాల్‌రెడ్డి నివాళి

- మాజీ ఎంపీపీ వెంకటరెడ్డి కుటుంబానికి పరామర్శ
- తూప్రాన్‌పేటలో దశదినకర్మ కార్యక్రమం

చౌటుప్పల్, మార్చి 18 (తొలివెలుగు న్యూస్): చౌటుప్పల్ మాజీ ఎంపీపీ తాడూరి వెంకటరెడ్డి తండ్రి స్వర్గీయ తాడూరి బుచ్చిరెడ్డి దశదినకర్మ కార్యక్రమం బుధవారం తూప్రాన్‌పేటలోని వారి వ్యవసాయ క్షేత్రంలో జరిగింది. ఈ కార్యక్రమానికి మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి హాజరయ్యారు. బుచ్చిరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మాజీ ఎంపీపీ వెంకటరెడ్డిని, వారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించి ధైర్యం చెప్పారు. బుచ్చిరెడ్డి మృతి పట్ల తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని బుచ్చిరెడ్డికి నివాళులు అర్పించారు.

నిరుపేద విద్యార్థులకు ఉచిత ఎంసెట్, నీట్ శిక్షణ

- గ్రామీణ విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి: ఇరుగదిండ్ల భాస్కర్
- ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి

చౌటుప్పల్, మార్చి 18 (తొలివెలుగు న్యూస్): మధ్యతరగతి, నిరుపేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు ఉన్నత చదువుల్లో రాణించి సమాజంలో గౌరవప్రదమైన స్థానాలు సంపాదించాలని ఇఎల్‌వి భాస్కర్ ఫౌండేషన్ చైర్మన్ ఇరుగదిండ్ల భాస్కర్ ఆకాంక్షించారు. చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని పేద విద్యార్థుల కోసం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా ఎంసెట్, నీట్ కోచింగ్ తరగతులను ప్రారంభిస్తున్నట్లు బుధవారం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ప్రతిభావంతులైన విద్యార్థులు తమ లక్ష్యాలను వదులుకోకూడదనే ఉద్దేశంతో ఈ ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. నాణ్యమైన కోచింగ్ అందజేసి గ్రామీణ ప్రాంత విద్యార్థులను డాక్టర్లు, ఇంజనీర్లుగా తీర్చిదిద్దడమే ఫౌండేషన్ ప్రధాన లక్ష్యమన్నారు. ఉచిత శిక్షణ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని తమ భవిష్యత్తును మెరుగుపరుచుకోవాలని సూచించారు. ఆసక్తి గల విద్యార్థులు తమ పూర్తి వివరాలను 96344 43338 నంబర్‌కు వాట్సాప్ ద్వారా పంపించి దరఖాస్తు చేసుకోవాలని భాస్కర్ విజ్ఞప్తి చేశారు.

గృహ అవసరాలకు వినియోగించే సిలిండర్లను పక్కదారి పట్టించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం

కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా లో గృహ అవసరాలకు వినియో గించే డొమెస్టిక్ ఎల్పిజి గ్యాస్ సిలిండర్లను వాణిజ్య పరమైన అవసరాలకు వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కె. హరిత ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో గృహ అవసరాలకు వినియోగించే ఎల్.పి.జి సిలిండర్ల కొరత లేదని, డొమెస్టిక్ సిలిండర్ లను వ్యాపార, వాణిజ్య అవసరాలకు వినియోగించే వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. హోటల్లు, రెస్టారెంట్లు, వీధి వ్యాపారులు ఎట్టి పరిస్థితులలో డొమెస్టిక్ సిలిండర్ లను వినియోగించకూడదని, రెవెన్యూ, పోలీస్, మున్సిపల్ శాఖల అధికారులతో కూడిన ఎన్ఫోర్స్ బృందాలు తనిఖీలు నిర్వహిస్తున్నారని తెలిపారు. డొమెస్టిక్ సిలిండర్ లను వాణిజ్యపరంగా వినియోగించినా నిల్వ ఉంచినా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

జాతీయ దిన పత్రిక
తొలివెలుగు
మన భాష.. మన పత్రిక..

ఇజ్రాయెల్ దాడుల్లో ఇరాన్ ఇంటెలిజెన్స్ మంత్రి ఎస్మాయిల్ ఖతిబ్ మృతి

అమెరికా, ఇజ్రాయెల్‌తో జరుగుతున్న యుద్ధంలో వరుసగా అగ్ర నేతల్ని కోల్పోతున్న ఇరాన్‌కు మరో ఎదురుదెబ్బ తగిలింది. ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడుల్లో ఇరాన్ ఇంటెలిజెన్స్ మంత్రి ఎస్మాయిల్ ఖతిబ్ హతమయ్యారు. ఈ విషయాన్ని ఇజ్రాయెల్ వెల్లడించింది. మంగళవారం రాత్రి టెహ్రాన్‌లో జరిపిన కాల్పుల్లో ఖతిబ్ మరణించినట్లు ఐడీఎఫ్ (ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్స్) తెలిపింది. అయితే, ఈ విషయాన్ని ఇరాన్ ఇంకా ధృవీకరించలేదు. ఇరాన్ ఇంటెలిజెన్స్ సిస్టమ్, నిఘా వ్యవస్థ, గూఢచర్యంతోపాటు ఇజ్రాయెల్, అమెరికాపై ఇరాన్ దాడుల్లో ఖతిబ్ కీలక పాత్ర పోషించాడు. అణచివేత, తీవ్రవాద కార్యకలాపాల్లో అతడి ప్రమేయం ఉన్నట్లు ఇరాన్ తెలిపింది. మహ్సా అమిని మృతి సందర్భంగా ఇరాన్‌లో జరిగిన నిరసనల సందర్భంగా ఖతిబ్ తీవ్ర అణచివేతకు పాల్పడ్డట్లు ఇజ్రాయెల్ చెబుతోంది. ఖతిబ్.. అయతొల్లా ఖమేనికి అత్యంత సన్నిహితుడిగా చెబుతుంటారు. ఇరాన్ సెక్యూరిటీ చీఫ్ అలీ లారిజాని, సైన్యం టాప్ కమాండర్ గులాం రెజా సాల్మనీ మరణించిన మరుసటి రోజే ఖతిబ్ హతమవ్వడం ఆ దేశానికి గట్టి ఎదురుదెబ్బే. మరోవైపు ఇరాన్ కీలక నేతల్ని హతమారుస్తామని ఇజ్రాయెల్ డిఫెన్స్ మినిస్టర్ ఇజ్రాయెల్ ఖట్జ్ తెలిపారు. ఈ విషయంలో సైన్యానికి ప్రధాని నెతన్యాహు పూర్తి స్వేచ్ఛ ఇచ్చారని వెల్లడించారు. ఎలాంటి అనుమతులు లేకుండానే ఇరాన్ అగ్ర నేతల్ని చంపేందుకు ఆదేశించారని చెప్పారు. మరోవైపు దక్షిణ లెబనాన్‌పై కూడా ఇజ్రాయెల్ దాడులు చేస్తోంది. తాజాగా ఒక బిల్డింగ్‌పై జరిపిన దాడుల్లో ఇద్దరు మరణించగా, మరో ఏడుగురు గాయపడ్డారు. ఇజ్రాయెల్ సైన్యానికి, హెజ్బుల్లా తీవ్రవాదులకు మధ్య జరిగిన దాడుల సందర్భంగా లెబనాన్‌పై దాడి జరిగిందని స్థానిక మీడియా పేర్కొంది. ఒకవైపు తమ దేశ కీలక నేతలు హతమవుతున్నా ఇరాన్ మాత్రం ఎదురుదాడులు ఆపడం లేదు. దుబాయ్ సహా పలు గల్ఫ్ దేశాలు, ఇజ్రాయెల్‌లపై ఇరాన్ దాడి చేస్తూనే ఉంది.

చైనా వెళ్తున్న రష్యా ఆయిల్ ట్యాంకర్.. దారి మళ్లి భారత్‌కు ప్రయాణం

న్యూఢిల్లీ: చైనాకు క్రూడ్ ఆయిల్ రవాణా చేస్తున్న రష్యా ఆయిల్ ట్యాంకర్ అనూహ్యంగా దారి మళ్లింది. భారత్ వైపు అది వేగంగా ప్రయాణిస్తున్నది. ఇరన్ యుద్ధం వల్ల ఏర్పడిన ఇంధన సంక్షోభం నేపథ్యంలో రష్యా చమురు దిగుమతులను భారత్ రెండు రెట్లు పెంచడంతో ఈ పరిణామం జరిగింది. (=బంంఖుఅ శీఅశ్రీ`ఖఅనెవతీ) షిప్ ట్రాకింగ్ డేటా ప్రకారం 'ఆక్వా టైటాన్' అనే రష్యా చమురు నౌక జనవరి చివరలో బాల్టిక్ పోర్ట్‌లో క్రూడ్ ఆయిల్ లోడ్ చేసుకున్నది. చైనాలోని రిజావో పోర్టులో అన్‌లోడింగ్ కోసం బయలుదేరింది. కాగా, అమెరికా- ఇజ్రాయెల్‌తో యుద్ధం నేపథ్యంలో హోర్ముజ్ జలసంధిపై ఇరాన్ ఆంక్షలు విధించింది. దీంతో ప్రపంచవ్యాప్తంగా ఇంధన సంక్షోభం ఏర్పడింది. ఈ నేపథ్యంలో రష్యా నుంచి చమురు కొనుగోలుకు భారత్‌కు అమెరికా అనుమతి ఇచ్చింది. మరోవైపు దేశంలో ఇంధన సంక్షోభం నేపథ్యంలో రష్యా చమురు దిగుమతులను భారత్ రెండు రెట్లు పెంచింది. ఈ పరిణామాల నేపథ్యంలో చైనా వైపు వెళ్తున్న రష్యా ఆయిల్ ట్యాంకర్ 'ఆక్వా టైటాన్' దారి మళ్లింది. దక్షిణ చైనా సముద్రంలో యూ టర్న్ తీసుకున్నది. భారత్ వైపు వేగంగా ప్రయాణిస్తున్నది. మార్చి 21న న్యూ మంగళూరుకు చేరుకోనున్నది. కాగా, మరో రష్యా ట్యాంకర్ కూడా భారత్ వైపు తన మార్గాన్ని మార్చుకున్నది. కజఖ్ సీపీసీ బ్లెండ్ ముడి చమురును రవాణా చేస్తున్న సూయజ్‌మాక్స్ నౌక 'జౌజౌ ఎన్' భారత పశ్చిమ తీరంలోని సిక్కాను తన గమ్యస్థానంగా సూచిస్తున్నది. మార్చి 25న ఇది అక్కడకు చేరుకుంటుందని షిప్ ట్రాకింగ్ డేటా ద్వారా తెలుస్తున్నది. అయితే ఇటీవల రష్యా ముడి చమురును చైనాకు రవాణా చేస్తున్న ఏడు ఆయిల్ ట్యాంకర్లు మార్గమధ్యలో ఇలా దారి మళ్లాయని ఇంధన నిఘా సంస్థ వోర్టెక్సా లిమిటెడ్ అంచనా వేసింది. భారత్‌లోని అన్ని ప్రధాన రిఫైనరీలు ఇప్పుడు రష్యా ముడి చమురు కోనుగోలుకు భారీగా ప్రయత్నిస్తున్నాయని వెల్లడించింది.



దివ్యాంగుల ఆత్మగౌరవం పెంచుతాం

- 'దివ్యాంగ శక్తి' ఆ సంకల్పంలో భాగమే: సీఎం
- మంగళగిరి బస్టాండ్‌లో దివ్యాంగులకు ఉచిత బస్సు పథకం ప్రారంభం
- మూడో దఫా రూ.226 కోట్ల పరిహారం చెల్లింపు
- ఉండవల్లిలో లాంఛనంగా చెక్కుల పంపిణీ
- వారంలోగా కొత్త డయాఫ్రం వాల్ సిద్ధం
- వచ్చే ఉగాది తర్వాత 2 నెలల్లో ప్రాజెక్టు తొలిదశ పూర్తి: సీఎం

అమరావతి: దివ్యాంగుల శక్తిని ప్రపంచానికి చాటేలా.. ఆత్మస్థైర్యంతో వారు పనిచేసేలా ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఆర్టీసీ బస్సుల్లో దివ్యాగులకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని అందుబాటులోకి తెస్తూ దివ్యాంగ శక్తి పథకాన్ని బుధవారం ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్‌తో కలిసి గుంటూరు జిల్లా మంగళగిరి ఆర్టీసీ బస్‌స్టేషన్‌లో ప్రారంభించారు. దివ్యాంగుల్లో ఆత్మగౌరవాన్ని పెంపొందించేందుకే ఈ పథకం తెచ్చామని ముఖ్యమంత్రి తెలిపారు. అనంతరం సీఎం క్యాంపు కార్యాలయంలో దివ్యాంగులకు ఆయన ఆత్మీయ విందు ఇచ్చారు. వారితో కలిసి చంద్రబాబు, లోకేశ్ భోజనం చేశారు. ఆయా సందర్భాల్లో చంద్రబాబు మాట్లాడారు. దివ్యాంగ శక్తి పథకం ప్రారంభించడం తనకు సంతృప్తిని, సంతోషాన్ని ఇచ్చిందన్నారు. "గతంలో చేయూత కార్యక్రమం ద్వారా దివ్యాంగులకు ట్రై సైకిళ్లు అందించాను. రూ.500 ఉండే దివ్యాంగుల పెన్షన్‌ను రూ.6వేలకు పెంచి అమలుచేస్తున్న రాష్ట్రం మాదే. తీవ్ర ఆరోగ్య ఇబ్బందులుండే వారికి రూ.10వేలు, మంచానికే పరిమితమైన వారికి రూ.15వేలు ఇస్తున్నాం. ఏటా రూ.33 వేల కోట్లు పింఛన్ల రూపంలో అందిస్తున్నాం. దివ్యాంగులు అంటే విభిన్న ప్రతిభావంతులు, సమస్యలను అధిగమించి విజయాలు సాధించే శక్తి వారిలో పుష్కలంగా ఉంది. పట్టుదలకు మారుపేరు. కఠోరంగా శ్రమిస్తారు. ఏదైనా సాధించే వరకు నిద్రపోరు." అంటూ అభినందించారు. 'ఎలాంటి ఖర్చు లేకుండా 21 కేటగిరీల బస్సుల్లో దివ్యాంగులు ఉచితంగా ప్రయాణం చేయవచ్చు. ఈ పథకం ద్వారా ఒక్కొక్కరికి నెలకు రూ.2వేల దాకా ఆదా అయ్యే అవకాశం ఉంది. మొదటి నుంచీ దివ్యాంగుల సంక్షేమానికి పని చేస్తోంది టీడీపీ మాత్రమే. భవిష్యత్తులోనూ దివ్యాంగులను ఆదుకునేలా మరిన్ని ఆలోచనలు చేస్తాం. వారికి త్వరలో మరింత మేలు చేకూరుస్తాం. దివ్యాంగ శక్తి ద్వారా 12.75 లక్షల మందికి ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నాం. ఈ పథకం కోసం ఏటా రూ.207 కోట్లు ఖర్చు చేస్తాం. కూటమి అమలు చేసే ఏ పథకం, ఏ కార్యక్రమమైనా నిరుపేదల సంక్షేమం కోసమే. ఎక్కువ సమస్యలు ఎదుర్కొనే దివ్యాంగులకు అండగా నిలబడాలనే కూటమి పనిచేస్తోంది. మహిళల కోసం తీసుకొచ్చిన స్త్రీశక్తి పథకం ద్వారా ఇప్పటి వరకు 52 కోట్ల ప్రయాణాలు జరిగాయి. దివ్యాంగుల సమస్యలపై ఎప్పుడూ పోరాటాలు చేసే మంద కృష్ణ మాదిగ, గోనుగుంట్ల కోటేశ్వరరావును అభినందిస్తున్నాను." రాష్ట్ర జీవనాడి పోలవరం బహుళార్ధ సాధక ప్రాజెక్టును.. భూములు కోల్పోయిన నిర్వాసితుల త్యాగానికి ప్రతిరూపంగా ముఖ్యమంత్రి చంద్రబాబు అభివర్ణించారు. ప్రాజెక్టు ప్రారంభానికి ముందే వారందరికీ పరిహారం చెల్లిస్తామని తెలిపారు. ప్రధాన నిర్మాణాలు, తొలిదశ పూర్తికి మరో రూ.5 వేల కోట్లు కావాలన్నారు. ప్రాజెక్టును వచ్చే ఏడాది ఉగాది తర్వాత రెండు నెలల్లో పూర్తి చేస్తామని ప్రకటించారు. గోదావరి పుష్కరాలకు ముందే దీనిని జాతికి అంకితం చేస్తామన్నారు. బుధవారం ఉండవల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో పోలవరం నిర్వాసితులతో ఆయన సమావేశమయ్యారు. వారికి మూడో దఫా పరిహారంగా రూ.226 కోట్ల చెక్కును లాంఛనంగా అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడారు. ఉగాది పర్వదినానికి ఒక రోజు ముందే నిర్వాసితుల ఖాతాల్లో ఈ మొత్తం జమ చేస్తున్నామని చెప్పారు. కూటమి ప్రభుత్వం వచ్చాక 2025 జనవరిలో సంక్రాంతిని పురస్కరించుకుని రూ.800 కోట్లు ఇచ్చామని.. రెండో విడతగా దీపావళి సందర్భంగా రూ.916 కోట్లు చెల్లించామని తెలిపారు. ప్రస్తుత రూ.226 కోట్లతో కలిపి ఈ 21 నెలల్లోనే 26,149 మంది నిర్వాసితులకు రూ.1,943.53 కోట్లు చెల్లించామని వివరించారు. వారి కుటుంబాల పట్ల కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉందన్నారు. సీఎం ఇంకా ఏం చెప్పారంటే.. పోలవరం ప్రాజెక్టును రెండు దశల్లో నిర్మిస్తున్నాం. తొలిదశలో 38,058 మంది నిర్వాసితులు ఉన్నారు. వీరికి నిర్మించాల్సిన 75 పునరావాస కాలనీల్లో ఇప్పటిదాకా 26 పూర్తయ్యాయి. మిగతా 49 కాలనీల నిర్మాణం ఈ ఏడాది డిసెంబరునాటికి పూర్తవుతాయి. ఇందుకోసం రూ.3,500 కోట్లు వ్యయం చేస్తున్నాం.

భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకగా 'ఇఫ్తార్' విందులు

భిన్నత్వంలో ఏకత్వానికి నిదర్శనంగా ఇఫ్తార్ విందులు ఉపయుక్తమవుతాయని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు నిర్మల్ జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇఫ్తార్ విందు కార్యక్రమం బుధవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేస్తూ, సమాజంలో ఐక్యతకు ఇటువంటి వేడుకలు ప్రతీకలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నిర్మల్ జిల్లాలో తాను బాధ్యతలు స్వీకరించినప్పటి నుండి అనేక కార్యక్రమాలు చూసినా, ఇంత సక్రమంగా, క్రమశిక్షణతో కూడిన ఏర్పాట్లు చూడటం ఆనందంగా ఉందని అన్నారు. ఏ కార్యక్రమమైనా ఇలాంటి ఘనతతో నిర్వహిస్తేనే అది అందరికీ చిరస్మరణీయంగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. ˘ర్ కార్యక్రమాలు కేవలం విందు కోసం మాత్రమే కాకుండా, అధికారుల మధ్య, ప్రజల మధ్య ఉన్న దూరాలను తగ్గించడానికి వేదికలుగా ఉపయోగపడతాయని తెలిపారు. అధికారుల మధ్య సత్సంబంధాలు పెంపొందితే జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతం అవుతాయని చెప్పారు. రంజాన్ మాసం పవిత్రతను ప్రస్తావిస్తూ, ఇది ఆత్మశుద్ధి, నియమ నిష్ఠలకు ప్రతీక అని, నెల రోజుల పాటు పాటించే క్రమశిక్షణను జీవితాంతం కొనసాగించాలని సూచించారు. కుల, మత భేదాలు పక్కన పెట్టి, తోటి మనిషికి సహాయం చేయడం ప్రతి మతం చెప్పే ప్రధాన సందేశమని స్పష్టం చేశారు. జిల్లాలో బతుకమ్మ, రంజాన్, ఉగాది వంటి పండుగలను అన్ని వర్గాల ప్రజలు కలిసి జరుపుకోవడం మన సంస్కృతిలోని ఐక్యతకు నిదర్శనమని కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు, జిల్లా ప్రజలకు ఉగాది ముందస్తు శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం కలెక్టరేట్ మహిళా సిబ్బందికి పంచాయతీ అధికారుల సంఘం ఆధ్వర్యంలో చీరలను కలెక్టర్ పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, డిఎఫ్ఓ సుశాంత్ సుఖదేవ్ బోబడే, ఆర్డీవో రత్న కళ్యాణి, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

తొలివెలుగు
శ్రీ పరాభవ నామ
సంవత్సరం
పంచాంగము
2026 - 2027
కొత్తదనంతో ఉగాది వచ్చేసింది..
ఈ ఉగాది ప్రతి ఒక్కరికీ కొత్త ఆనందాన్ని,
జీవితంలో శాంతిని ప్రసాదించాలని కోరుకుంటున్నారు..
Happy Ugadi

2026 2027 శ్రీ పరాభవ నామ సంవత్సరంలో ద్వాదశ రాశుల వారికి రాశిపలాలు.

ఆదాయం - 11 **రాజ పూజ్యం - 02**

వ్యయం - 05 **అవమానం - 04**

ఈ రాశి వారికి శ్రీ పరాభవ నామ సంవత్సరంలో అనగా 19 మార్చ్ 2026 నుండి 6 ఏప్రిల్ 2027 వరకు ఉన్న గురు గ్రహం వలన సంవత్సరం అంతా చక్కటి అనుకూల ఫలితాలు ఏర్పడును. ముఖ్యంగా 31 మే 2026 తదుపరి మంచి యోగవంతమైన ఫలితాలు పొందుతారు. ఉద్యోగస్తులకు పదోన్నతి లభిస్తుంది. వ్యక్తిగత జాతకంలో గురు గ్రహం బలంగా ఉన్న నిరుద్యోగులకు చక్కటి ప్రభుత్వ ఉద్యోగం లభిస్తుంది. ఈ సంవత్సరంలో అక్టోబర్ , నవంబర్, డిసెంబర్ నెలలలో సంతాన ప్రయత్నాలు ఫలిస్తాయి. మేషరాశికి చెందిన విద్యార్థులకు ఈ పరాభవ నామ సంవత్సరం అత్యంత అనుకూల కాలం. వివిధ ప్రవేశ పరీక్షలలో మంచి ఫలితాలు పొందగలుగుతారు. మొత్తం మీద శ్రీ పరాభవ నామ సంవత్సరంలో మేషరాశి వారికి బృహస్పతి వలన లాభములు ఏర్పడును.ఈ సంవత్సరం నూతన అంశాల పట్ల జ్ఞానం పెంపొందించుకుంటారు.

ఈ రాశివారు ఈ సంవత్సరం ప్రతిరోజూ శ్రీ విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం , శ్రీ హనుమత్ ,వేంకటేశ్వర స్వామి ఆలయాల దర్శనం చేసుకోవటం మంచిది.

ఆదాయం - 05 **రాజ పూజ్యం -05**

వ్యయం - 14 **అవమానం - 04**

ఈ రాశి వారికి శ్రీ పరాభవ నామ సంవత్సరంలో అనగా 19 మార్చ్ 2026 నుండి 6 ఏప్రిల్ 2027 వరకు ఉన్న తెలుగు కాల మాన సంవత్సరంలో గురు గ్రహం వలన సంవత్సరం అంతా అధిక భాగం అనుకూల ఫలితాలు ఏర్పడతాయి. విద్యా శాఖ లేదా ఉపాధ్యాయ వృత్తులకు సంబందించిన వారికి ఈ సంవత్సరం బాగా కలసి వస్తుంది. 31 మే 2026 వరకు ఆశించిన విధంగా ధన సంపదను నిలువ చేసుకోగలరు. దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యల నుండి ఉపశమనం లభిస్తుంది. 01 జూన్ 2026 నుండి 30 అక్టోబర్ 2026 వరకు ఉన్నకాలంలో మీ జీవన అభివృద్ధికి మీ సోదర వర్గం సంపూర్ణంగా సహకరిస్తుంది. ప్రభావంతమైన స్థానాల్లో ఉన్న మీ సోదర సోదరి వర్గం వలన ఆర్థికంగా లాభ పడతారు. వ్యక్తిగత జాతకం లో గురు గ్రహ బలం లోపించిన లేదా వ్యతిరేకంగా కలిగి ఉన్న వారికి మాత్రం సోదర సోదరి వర్గం వలన సమస్యలు ఎదురగును. 31 అక్టోబర్ 2026 నుండి 23 జనవరి 2027 వరకు గురు గ్రహం వలన అంతగా గొప్ప అనుకూల ఫలితాలు ఉండవు. ముఖ్యంగా విద్యార్థులకు ఈ కాలం పరీక్షా కాలంగా ఉండును. అధికంగా శ్రమించాల్సి వస్తుంది.ఈ కాలంలో భూ సంబంధ క్రయవిక్రయాలు చేయకుండా ఉండుట మంచిది. 24 జనవరి 2027 నుండి 06 ఏప్రిల్ 2027 వరకు గురు గ్రహం వలన తిరిగి చక్కటి అనుకూల ఫలితాలు ఎదురగును. వ్యక్తిగత జీవితంలో సుఖ ప్రదమైన కాలం ఏర్పడుతుంది.

ఈ రాశివారు ఈ సంవత్సరం ప్రతిరోజూ శ్రీ రాజేశ్వర స్వామి అష్టోత్తర శతనామ స్తోత్ర పారాయణం , ప్రతి సోమవారం శివాలయంలో అభిషేకం చేసుకోవటం మంచిది.ఈ రాశివారు ఈ సంవత్సరం ప్రతిరోజూ శ్రీ గురుదత్త స్తోత్ర పారాయణం ,

ఆదాయం - 08 **రాజ పూజ్యం -01**

వ్యయం - 11 **అవమానం - 07**

ఈ రాశి వారికి శ్రీ పరాభవ నామ సంవత్సరంలో అనగా 19 మార్చ్ 2026 నుండి 6 ఏప్రిల్ 2027 వరకు ఉన్న తెలుగు కాల మాన సంవత్సరంలో గురు గ్రహం వలన సంవత్సరం అంతా అధిక భాగం అనుకూల ఫలితాలు ఏర్పడతాయి. సంవత్సర ప్రారంభం నుండి 31 అక్టోబర్ 2026 వరకు మిధునరాశి వారు అనుకూలుడైన గురు గ్రహం వలన మిక్కిలి పేరు ప్రతిష్టలు సంపాదిస్తారు. పుత్ర సంతానం కొరకు ప్రయత్నిస్తున్న వారికి వంశాభివృద్ధి ఏర్పడుతుంది. ముఖ్యంగా జూన్, జూలై మరియు ఆగష్టు మాసాలలో ఆరోగ్య పరంగా, భాగ్య సంపదల పరంగా మిక్కిలి అనుకూలత కలిగిన కాలం ఎదుర్కొంటారు. చిరకాలంగా ఎదురుచూస్తున్న విధంగా ధనాన్ని నిలువ చేయగలుగుతారు.వివాహ సంబంధ ప్రయత్నాలు తప్పక ఫలిస్తాయి. 01 నవంబర్ 2026 నుండి 23 జనవరి 2027 వరకు గురువు మిధున రాశి వారందరికీ ప్రతికూల ఫలితాలు ప్రసాదించును. 24 జనవరి 2027 నుండి శ్రీ పరాభవ నామ సంవత్సరం చివరి వరకు గురువు వలన తిరిగి చక్కటి అనుకూల ఫలితాలు లభిస్తాయి. ఆర్థిక సంబంధ విషయాలలో ఆశించిన ప్రయోజనాలు పొందగలుగుతారు.

ఈ రాశివారు ఈ సంవత్సరం ప్రతిరోజూ శ్రీ విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం , శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయాల దర్శనం చేసుకోవటం మంచిది.

ఆదాయం - 02 **రాజ పూజ్యం -04**

వ్యయం - 11 **అవమానం - 07**

ఈ రాశి వారికి శ్రీ పరాభవ నామ సంవత్సరంలో అనగా 19 మార్చ్ 2026 నుండి 6 ఏప్రిల్ 2027 వరకు ఉన్న ఈసంవత్సరంలో గురు గ్రహం వలన సంవత్సరం అంతా అనుకూల ఫలితాలు ఏర్పడతాయి. 31 మే 2026 వరకు మీ ద్వారా భారీ ధర్మకార్యములు నిర్వహించబడతాయి. 01 జూన్ 2026 నుండి సంవత్సరం ముగింపు వరకు గురు గ్రహం వలన సంపూర్ణంగా అనుకూల ఫలితాలు ఏర్పడతాయి. నూతన విద్యలు అభ్యసించాలి అనే కోరిక నెరవేరుతుంది. సర్వదా సంతోషం కలిగిన ఆశాజీవులుగా ఉంటారు. స్త్రీలకూ అదృష్టం వరిస్తుంది. దైవానుగ్రహం వశమున సర్వ సుఖములు ప్రాప్తించును.మీ జీవితంలో అత్యున్నత స్థాయి ని పొందవలెను అనే ఆకాంక్ష తీరుతుంది. కళారంగంలోని వారికి నటనా కౌసల్యం పెరుగుతుంది. మొత్తం మీద కర్కాటక రాశి వారికి శ్రీ పరాభవ నామ సంవత్సరంలో గురు గ్రహం వలన బాగా లబ్ది చేకూరుతుంది.

ఈ రాశివారు ఈ సంవత్సరం ప్రతిరోజూ శ్రీ లక్ష్మీ అష్టోత్తర శతనామ స్తోత్ర పారాయణం , శ్రీ అమ్మవారి ఆలయాల దర్శనం చేసుకోవటం మంచిది.

2026 2027 శ్రీ పరాభవ నామ సంవత్సరంలో ద్వాదశ రాశుల వారికి రాశిపలాలు.

ఆదాయం - 05 | రాజ పూజ్యం -07

వ్యయం - 05 | అవమానం - 07

ఈ వారికి శ్రీ పరాభవ నామ సంవత్సరంలో అనగా 19 మార్చ్ 2026 నుండి 6 ఏప్రిల్ 2027 వరకు ఉన్న తెలుగు కాల మాన సంవత్సరంలో గురు గ్రహం వలన సంవత్సరం అంతా అనుకూల ఫలితాలు ఎదురగును. బృహస్పతి 31 మే 2026 వరకు న్యాయవంతమైన ధన సంపాదన ఆర్జించునట్లు చేయును. ఉన్నత స్నేహ స్వభావం కలిగిన విశ్వాసపాత్రులు అయిన నూతన స్నేహ వర్గం లభిస్తుంది. సింహరాశి మహిళలు తమ భర్తల వృత్తి వ్యాపారములందు అడుగుపెట్టడానికి ఇది మంచి కాలం. మానవతా విలువలు పెరుగుతాయి. 01 జూన్ 2026 నుండి 30 అక్టోబర్ 2026 వరకు బృహస్పతి వలన ఆదాయం కన్నా వ్యయం అధికంగా ఎదురగును.అవివాహిత పురుషులకు ఐశ్వర్యవంతురాలైన జీవిత భాగస్వామి లభిస్తుంది. విదేశీ జీవన ప్రయత్నాలు ఈ సంవత్సరం విజయవంతం అవుతాయి. 31 అక్టోబర్ 2026 నుండి 23 జనవరి 2027 వరకు కెరీర్ పరంగా అత్యున్నత స్థాయి పొందు అవకాశములు లభిస్తాయి. ప్రతీ విషయంలో ఉత్తమ ఫలితాలు ఎదురగును. 24 జనవరి 2027 నుండి సంవత్సరం చివరి వరకు దైవానుగ్రహం వలన సుఖప్రదమైన జీవనం పొందుతారు. సొంత గృహ లేదా భూ సంబంధ స్థిరాస్తులు ఏర్పాటు చేసుకొనుటకు ఇది అనుకూలమైన సంవత్సరం.

ఈ రాశివారు ఈ సంవత్సరం ప్రతిరోజూ శ్రీ విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం , శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయాల దర్శనం చేసుకోవటం మంచిది.

ఆదాయం - 05 | రాజ పూజ్యం -06

వ్యయం - 14 | అవమానం - 03

ఈ వారికి శ్రీ పరాభవ నామ సంవత్సరంలో అనగా 19 మార్చ్ 2026 నుండి 6 ఏప్రిల్ 2027 వరకు ఉన్న తెలుగు కాల మాన సంవత్సరంలో గురు గ్రహం వలన సంవత్సరం అంతా అనుకూల ఫలితాలు ఏర్పడతాయి.దైవ భక్తీ పెరుగుతుంది. కుటుంబ సభ్యుల తీర్థయాత్రలు లేదా విహార యాత్రల కొరకు చక్కటి ఏర్పాట్లు చేస్తారు. ఆర్థికంగా బాగుంటుంది. ముఖ్యంగా 31 అక్టోబర్ 2026 నుండి శ్రీ పరాభవ నామ సంవత్సరం ముగిసే వరకు సులువైన ధనాదాయం లభిస్తుంది. మొత్తం మీద తులారాశి వారు శ్రీ పరాభవ నామ సంవత్సరంలో బృహస్పతి వలన శ్రేష్టమైన జీవితాన్ని అనుభవిస్తారు. ప్రభుత్వ ఉద్యోగులకు నూతన అధికారములు లభిస్తాయి. వ్యక్తిగత జాతకంలో గురు గ్రహ బలం లోపించిన వారు పైన పేర్కొన్న శుభ ఫలితాలను సంపూర్ణంగా పొందలేకపోతారు.

ఈ రాశివారు ఈ సంవత్సరం ప్రతిరోజూ శ్రీ గురు చరిత్ర పారాయణం , శ్రీ దత్తాత్రేయ స్వామి ఆలయాల దర్శనం చేసుకోవటం మంచిది.

ఆదాయం - 11 | రాజ పూజ్యం -02

వ్యయం - 05 | అవమానం - 06

ఈ వారికి శ్రీ పరాభవ నామ సంవత్సరంలో అనగా 19 మార్చ్ 2026 నుండి 6 ఏప్రిల్ 2027 వరకు ఉన్న తెలుగు కాల మాన సంవత్సరంలో గురు గ్రహం వలన సంవత్సరంలో అధిక భాగం అనుకూలమైన మరియు యోగవంతమైన ఫలితాలు ఏర్పడతాయి. సంవత్సరం ప్రారంభం నుండి 31 మే 2026 వరకు బృహస్పతి వృశ్చికరాశి వారికి తీవ్ర ఇబ్బందులు కలుగచేయును. ముఖ్యంగా ఆర్ధిక్యంగా చాలా ఇబ్బంది పడవలసి వస్తుంది. ఆరోగ్య విషయాలలో కూడా జాగ్రత్తగా ఉండవలెను. ఈ రాశి వారు ఈ సంవత్సరం పరిస్థితుల తీవ్రత అనుసరించి గురు శాంతి, జపములు జరిపించుకోనుట మంచిది.

ఈ రాశివారు ఈ సంవత్సరం ప్రతిరోజూ శ్రీ గురు రాఘవేంద్ర స్వామి స్తోత్ర పారాయణం , శ్రీ గురు దత్తాత్రేయ స్వామి ఆలయాల దర్శనం చేసుకోవటం మంచిది.

ఆదాయం - 08 | రాజ పూజ్యం -03

వ్యయం - 11 | అవమానం - 03

ఈ వారికి శ్రీ పరాభవ నామ సంవత్సరంలో అనగా 19 మార్చ్ 2026 నుండి 6 ఏప్రిల్ 2027 వరకు ఉన్న తెలుగు కాల మాన సంవత్సరంలో గురు గ్రహం వలన సంవత్సరం అంతా అనుకూల ఫలితాలు లభిస్తాయి. 31 మే 2026 వరకు అన్ని విధములా సౌకర్యవంతమైన జీవితాన్ని కలుగచేయును. పేరు ప్రతిష్టలు ప్రాప్తింప చేయును. నూతన వాహన సౌఖ్యమును ఏర్పరచును. స్త్రీలకు సువర్ణ సంబంధ లాభములు ప్రాప్తించును. విద్యార్థులు చక్కటి శ్రమ పట్టుదల ప్రదర్శించెదరు.యువకులు మిక్కిలి న్యాయవర్తనులుగా జీవించి జీవితంలో అభివృద్ధిని మరియు కీర్తిని పొందుతారు. 01 జూన్ 2026 నుండి 30 అక్టోబర్ 2026 వరకు చక్కటి ఆరోగ్యమును అనుభవిస్తారు. ఎదిగిన పుత్ర సంతానం వలన మీ చిరకాల స్వప్నాలు కార్యరూపం దాల్చును. సమాజంలో పలుకుబడి పెరుగుతుంది. ఆర్థికంగా ఈ కాలం మిక్కిలి అనుకూలంగా ఉంటుంది. 31 అక్టోబర్ 2026 నుండి 23 జనవరి 2027 వరకు కన్యారాశి వారికి బృహస్పతి వలన ప్రతికూల ఫలితాలు లభిస్తాయి. 24 జనవరి 2027 నుండి శ్రీ పరాభవ నామ సంవత్సర ముగింపు వరకు కన్యారాశి వారికి బృహస్పతి వలన తిరిగి చక్కటి అనుకూల ఫలితాలు ప్రాప్తించును.

ఈ రాశివారు ఈ సంవత్సరం ప్రతిరోజూ శ్రీ విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం , శ్రీ ఆంజనేయ స్వామి ఆలయాల దర్శనం చేసుకోవటం మంచిది.

2026 2027 శ్రీ పరాభవ నామ సంవత్సరంలో ద్వాదశ రాశుల వారికి రాశిపలాలు.

ఆదాయం - 14 **రాజ పూజ్యం -01**
వ్యయం - 11 **అవమానం - 02**

ఈ రాశి వారికి శ్రీ పరాభవ నామ సంవత్సరంలో అనగా 19 మార్చ్ 2026 నుండి 6 ఏప్రిల్ 2027 వరకు ఉన్న సంవత్సరంలో గురు గ్రహం వలన సంవత్సరం అంతా మిశ్రమ ఫలితాలు ఎదురగును. 31 మే 2026 వరకు బృహస్పతి వలన చక్కటి అనుకూల ఫలితాలు ఏర్పడతాయి. విద్యార్థులకు బాగా కలసి వస్తుంది. చక్కటి మిత్ర వర్గం లభిస్తుంది. వ్యాపార వర్గం వారికి చక్కటి అభివృద్ధి లభిస్తుంది. పేరు ప్రతిష్ఠలు సంపాదిస్తారు. 01 జూన్ 2026 నుండి 30 అక్టోబర్ 2026 నుండి గురువు వలన ప్రతికూల ఫలితాలు ఏర్పడతాయి. పనియందు శ్రమ అధికం అవుతంది.

ఈ రాశివారు ఈ సంవత్సరం ప్రతిరోజూ శ్రీ విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం , శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయాల దర్శనం

ఆదాయం - 02 **రాజ పూజ్యం -01**
వ్యయం - 08 **అవమానం - 02**

ఈ రాశి వారికి శ్రీ పరాభవ నామ సంవత్సరంలో అనగా 19 మార్చ్ 2026 నుండి 6 ఏప్రిల్ 2027 వరకు ఉన్న తెలుగు కాల మాన సంవత్సరంలో గురు గ్రహం వలన సంవత్సరం అంతా ప్రతికూల ఫలితాలు ఎదురగును. 31 మే 2026 వరకు గురువు వలన మకరరాశి వారికి కడుపులో మంట లేదా ఉదర మాంద్యం, కీళ్ళ వాతం వంటి ఆరోగ్య సమస్యలు బాధించును. ఆర్థికంగా ఋణ బాధలు ఎదుర్కొనవలసి వస్తుంది. మీరు ఆలోచించు ఎత్తుగడలు కలసి రావు. శరీర దారుఢ్యత తగ్గుతుంది. ఇతరులు తమకు చేసిన మేలు మరిచిపోతారు. 01 జూన్ 2026 నుండి 30 అక్టోబర్ 2026 వరకూ బృహస్పతి వలన వైవాహిక జీవనంలో అనుకూలత మినహా మిగిలిన విషయాలలో ఇబ్బందులు కొనసాగును. అవివాహితుల వివాహ ప్రయత్నాలు ఫలిస్తాయి. ఈ కాలంలో మీకు ఇష్టమైన సాహసోపేతమైన కార్యములు చేయగలుగుతారు. 31 అక్టోబర్ 2026 నుండి 23 జనవరి 2027 వరకు గురువు వలన మరింత తీవ్రంగా ప్రతికూల ఫలితాలు ఎదుర్కొంటారు. కుటుంబ పరమైన అవసరాల వలన చేతిలో ధనం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారు. ఈ కాలంలో ఏ ప్రయత్నం చేసినా అదృష్టం కలసిరాదు. 24 జనవరి 2027 నుండి ఈ సంవత్సరం అంతా ప్రతీ దినం గురు దైవ ఆరాధన చేసుకోవడం మంచిది. అనారోగ్య సమస్యల నుండి బయట పడడానికి ఈ సంవత్సరంలో తరచుగా నవగ్రహ శాంతి జపములు జరిపించుకోనుట మంచిది.

ఈ రాశి వారు ఈ సంవత్సరం ప్రతిరోజూ హనుమాన్ చాలీసా ,సంక్షిప్త రామాయణం వంటి పారాయణం ,హనుమత్ ఆలయాలు సందర్శించడం మంచిది.

ఆదాయం - 14 **రాజ పూజ్యం -01**
వ్యయం - 11 **అవమానం - 02**

ఈ రాశి వారికి శ్రీ పరాభవ నామ సంవత్సరంలో అనగా 19 మార్చ్ 2026 నుండి 6 ఏప్రిల్ 2027 వరకు గురు గ్రహం వలన సంవత్సరం అంతా మిశ్రమ ఫలితాలు పొందుతారు. 31 మే 2026 వరకూ చక్కటి శ్రేయస్కరమైన ఫలితాలు పొందుతారు. వైవాహిక జీవన మరియు సంతాన సంబంధ విషయాలలో తప్పకుండా మనోవాంచా ఫలసిద్దత లభిస్తుంది. గృహంలో సభ్యులందరూ మీకు అనుకూలంగా ఉంటారు. మీ నిర్ణయాలను గౌరవిస్తారు. ఇంట , బయట అధిక గౌరవాభిమనాములు వృద్ధి చెందుతాయి. దైవ సంబంధ విషయాలలో సంతృప్తికర సమయాన్ని గడపగలుగుతారు. కుటుంబంలో అందరు ఆరోగ్యవంతులై ఉంటారు. 01 జూన్ 2026 నుండి 30 అక్టోబర్ 2026 వరకు బృహస్పతి వలన ప్రతికూల ఫలితాలు ఎదురగును. 31 అక్టోబర్ 2026 నుండి 23 జనవరి 2027 వరకు బృహస్పతి వలన తిరిగి చక్కటి అనుకూల ఫలితాలు ఏర్పడతాయి. ఈ కాలంలో జీవిత భాగస్వామి తరపు నుండి ఆర్థికంగా లాభపడతారు. ఎటువంటి వివాదం అయినా సులువుగా మీకు అనుకూలంగా పరిష్కారం అవుతుంది.24 జనవరి 2027 నుండి శ్రీ పరాభవ నామ సంవత్సరం చివరి వరకు గురువు వలన తిరిగి ప్రతికూల ఫలితాలు పొందుతారు. వ్యావహారికంగా మీ కార్యదక్షత తగ్గుతుంది. స్త్రీలకు లోభత్వం అధికం అవుతుంది. కుంభరాశి వారు శ్రీ పరాభవ నామ సంవత్సరంలో తరచుగా శనగలు బ్రాహ్మణులకు దానం ఇచ్చుట మంచిది.

ఈ రాశి వారు ఈ సంవత్సరం సుదరకాండ పారాయణం ,సంక్షిప్త రామాయణం వంటి పారాయణం ,శ్రీ రామ ,హనుమత్ ఆలయాలు సందర్శించడం మంచిది.

ఆదాయం - 14 **రాజ పూజ్యం -07**
వ్యయం - 11 **అవమానం - 02**

ఈ రాశి వారికి శ్రీ పరాభవ నామ సంవత్సరంలో అనగా 19 మార్చ్ 2026 నుండి 6 ఏప్రిల్ 2027 వరకు గురు గ్రహం వలన సంవత్సరం అంతా అనుకూల ఫలితాలు లభిస్తాయి. సమర్థవంతమైన గృహ యజమానిగా పేరు తెచ్చుకుంటారు. చక్కటి వాహన సౌకర్యం ఏర్పాటు చేసుకుంటారు. స్వ శక్తి తో సర్వ సౌఖ్యములను పొందగలుగుతారు. స్థిరాస్తుల నుండి ధనార్జన పొందగలుగుతారు. సంస్కారవంతమైన జీవనాన్ని కలిగి ఉంటారు. 10 జూన్ 2026 నుండి 15 నవంబర్ 2026 మధ్య కాలంలో మీనరాశి వారు బృహస్పతి వలన మిక్కిలి అదృష్గత అనుభవిస్తారు. ముఖ్యంగా విద్యార్థులకు, విద్యా సంబంధ వ్యాపారములు చేయువారికి ఈ కాలం మిక్కిలి అనుకూల కాలం. 16 నవంబర్ 2026 నుండి 31 జనవరి 2027 వరకు కొంత ప్రతికూల ఫలితాలు ఎదురగును. శత్రువులు ఏర్పడతారు కానీ ఏమి చేయలేరు. 01 ఫెబ్రవరి 2027 నుండి సంవత్సరం ముగింపు వరకు మీనరాశి వారు బృహస్పతి వలన తిరిగి అతి చక్కటి అనుకూల ఫలితాలు పొందుతారు.

ఈ రాశి వారు ఈ సంవత్సరం శ్రీ విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం ,విష్ణు ఆలయాలు సందర్శించడం మంచిది.

తిరుమల తిరుపతి దేవస్థాన ఆచార్య పురుషులు శ్రీ మాన్ శ్రీ ఉ.వే శ్రీ వీరవల్లి కుమార శ్రీ నివాస రాఘవాచార్యుల ప్రియశిష్యులు.జ్యోతీష్యవాచస్పతి బిరుదాంకితులైన

ఇందూర్తి ఆచార్య కళ్యాణ్.
జ్యోతీష్యులు ,అధ్యాపకులు ,పురోహితులు.
శ్రీ మద్ధర్మపురి లక్ష్మీ నృసింహ వాస్తు ,జ్యోతీష్యాలయం.

నిర్మల్ ,
9440449535 .